RNI No. APTEL/2009/28868

# సిటిజన్ టైమ్స్

ప్రజా సమస్యలపై పోరాటమే మా లక్ష్యం

తెలుగు దినపత్రిక

CITIZEN TIMES TELUGU DAILY

సంపుటి :18 | సంచిక : 290 | సంపాదకులు : కంచర్ల సందీప్ కుమార్ | ప్రచురణ : విశాఖపట్నం | 26-8- 2026 | పేజీలు : 8 | వెల : 2/- రూ ॥

VOLUME: 18 | ISSUE : 290 | EDITOR:KANCHERLA SANDEEP KUMAR | PUBLISHED: VISAKHAPATNAM | 26-8-2026 | PAGES: 8 | PRICE : 2/- RS



# 30 ఏళ్ల సంకల్పం సాకారం..

## ఆగస్టు 31న వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభం..

- చంద్రబాబు ఎమోషనల్ ట్వీట్
- ఈ నెల 31న వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు
- 30 ఏళ్ల క్రితం తాను శంకుస్థాపన చేసిన ప్రాజెక్టును ప్రారంభిస్తున్నట్లు వెల్లడి
- నల్లమల సాగర్‌లోకి 10.7 టీఎంసీల నీటిని విడుదల చేయనున్న ప్రభుత్వం
- వెలిగొండ జలాలతో ఈ ప్రాంత అభివృద్ధికి రెక్కలు వస్తాయని ధీమా



**అమరావతి, సిటిజన్ టైమ్స్**

ఉమ్మడి ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రజల మూడు దశాబ్దాల కలను సాకారం చేస్తూ, అత్యంత ప్రతిష్ఠాత్మకమైన వెలిగొండ ప్రాజెక్టును ఈ నెల 31వ తేదీన ప్రారంభించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. 1996లో ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా తానే శంకుస్థాపన చేసిన ఈ ప్రాజెక్టును, మళ్లీ తన చేతుల మీదుగానే ప్రారంభించడంపై ఆయన ఎక్స్ వేదికగా భావోద్వేగంతో స్పందించారు. 'వెలిగొండ జలసిరులు – అభివృద్ధికి రెక్కలు' అంటూ ఆయన తరువాయి 2లో..

# రాయలసీమకు సుజ్లాన్ భరోసా..

- రూ.10 వేల కోట్ల ప్రాజెక్టుకు మంత్రి నారా లోకేశ్ శంకుస్థాపన
- రాయదుర్గంలో సుజ్లాన్ విండ్ ఎనర్జీ ప్రాజెక్టులకు శంకుస్థాపన
- రూ.10,000 కోట్ల పెట్టుబడితో 1,325 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం
- ప్రాజెక్టు ద్వారా 4,000 మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు
- మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా కొత్త బ్లేడ్ ప్రొడక్షన్ లైన్స్ ప్రారంభం
- అనంత, ఉరవకొండ, కల్యాణదుర్గం నియోజకవర్గాల్లో ప్రాజెక్టుల ఏర్పాటు



**రాయలసీమ, సిటిజన్ టైమ్స్**

ఆంధ్రప్రదేశ్‌లో పునరుత్పాదక ఇంధన రంగం కొత్త ఊపు అందుకుంది. పవన విద్యుత్ రంగంలో రాష్ట్రానికి మరో భారీ పెట్టుబడి తరలివచ్చింది. అనంతపురం జిల్లా, రాయదుర్గం నియోజకవర్గంలో ప్రఖ్యాత సుజ్లాన్ సంస్థ తరువాయి 2లో..



## 'గ్రేట్ గ్రీన్ వాల్' కార్యక్రమంలో భాగంగా

# తాటి వనాలను పెంచే కార్యక్రమం ప్రారంభమైంది

### తీరప్రాంతం వెంబడి 5,499 హెక్టార్లలో తాటి వానాలను ఏర్పాటు చేస్తున్నామన్న పవన్

**అమరావతి, సిటిజన్ టైమ్స్**

రాష్ట్రంలోని సుదీర్ఘ తీరప్రాంతానికి సహజమైన రక్షణ కవచాన్ని ఏర్పరచేందుకు 'గ్రేట్ గ్రీన్ వాల్' ప్రాజెక్టులో భాగంగా తాటివనాలను పెంచే ప్రక్రియను ప్రారంభించినట్లు ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వెల్లడించారు. తీరప్రాంతం వెంబడి సుమారు 5,499 హెక్టార్ల పరిధిలో ఈ తాటి వనాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వివరించారు. ప్రస్తుతం తాటికాయల సీజన్ నడుస్తుండటంతో, అటవీశాఖ ద్వారా తాటి గింజలను సేకరించి తీరప్రాంతాల్లో నాటే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం తరువాయి 2లో..

# 12, 13 తేదీల్లో భారత్‌కు షీ జిన్‌పింగ్!



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

చైనా అధినేత షీ జిన్‌పింగ్ వచ్చే నెల 12, 13 తేదీల్లో భారత్‌లో పర్యటించనున్నట్లు సమాచారం. దిల్లీలో జరగనున్న బ్రిక్స్ సదస్సుల్లో పాల్గొనేందుకు ఆయన భారీ బృందంతో వచ్చే అవకాశముందని తెలిసింది. ఆయన వస్తే ఏడేళ్ల తర్వాత భారత్‌కు రావడం ఇదే తొలి సారి తరువాయి 2లో..

## ప్రధాని మోదీకి రాహుల్, ఖర్గే లేఖ..

# కులగణనపై కీలక సూచన

- ప్రధాని మోదీకి ఇద్దరూ సంయుక్తంగా లేఖ
- ఓపెన్ ఎండెడ్ విధానంతో కులాల వివరాలు తప్పుగా నమోదయ్యే ప్రమాదం

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

కులగణనలో వివరాల సేకరణ విధానంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోదీకి ఇద్దరూ సంయుక్తంగా లేఖ రాశారు. ప్రస్తుతం ప్రతిపాదించిన 'ఓపెన్ ఎండెడ్' విధానాన్ని తరువాయి 2లో..




# పైలట్ల డ్రగ్ టెస్టులపై కొత్త రూల్...

## కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ఏమన్నారంటే?


- దేశంలోని పైలట్లందరికీ ఏటా డ్రగ్ టెస్టులు తప్పనిసరి చేసే యోచనలో కేంద్రం
- ప్రస్తుత 10 శాతం రాండమ్ టెస్టింగ్ విధానాన్ని మార్చాలని ప్రతిపాదన

**అమరావతి, సిటిజన్ టైమ్స్**

దేశంలోని పైలట్లందరికీ ఏటా తప్పనిసరిగా డోప్ టెస్టులు నిర్వహించే ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తోందని పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఉన్న పైలట్లలో కేవలం 10 శాతం మందికి మాత్రమే రాండమ్‌గా ఈ తరువాయి 2లో..



# రష్యాలో దిగిన అమెరికా 'మిస్టరీ' విమానం




**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

ఉక్రెయిన్–రష్యా మధ్య తీవ్ర స్థాయిలో ఘర్షణలు కొనసాగుతోన్న వేళ అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. తరువాయి 2లో..

## పోలీసులు, విద్యార్థుల మధ్య ఘర్షణ..

# బిహార్‌లో ఉద్రిక్తత



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

బిహార్‌లో విద్యార్థుల నిరసనలు ఉద్రిక్తంగా మారాయి. బిహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (బీపీఎస్సీ) 70వ పరీక్షలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ.. దానిని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వందలాది మంది విద్యార్థులు రోడ్డెక్కారు. పట్నాలోని గాంధీ తరువాయి 2లో..




## అమెరికా 'మాలిస్' రేంజే వేరు..

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

ఆధునిక యుద్ధ వ్యూహాలపై పదునుపెడుతోన్న అమెరికా తాజాగా సరికొత్త ఆయుధాన్ని సిద్ధం చేసింది. సుదూరం నుంచే శత్రు ముప్పును ఛేదించేలా సరికొత్త ఎయిర్–టు–ఎయిర్ క్షిపణిని యూఎస్ నేవీ ఆవిష్కరించింది. 'మాలిస్'గా పిలిచే ఈ దీర్ఘశ్రేణి క్షిపణి వందల కిలోమీటర్ల దూరం నుంచే విమానాలను కూల్చగలదని అగ్రరాజ్యం చెబుతోంది. ఇంతకీ ఏంటీ క్షిపణి..? దీని ప్రత్యేకతలేంటీ..?

**మాలిస్.. 'రేంజ్' వేరు..:** మాలిస్ క్షిపణి తరువాయి 2లో..

# స్థానికంలో ఏకగ్రీవాలు జరిగితే ఎమ్మెల్యే టికెట్ ఉండదు: జగన్



**అమరావతి, సిటిజన్ టైమ్స్**

స్థానిక ఎన్నికల్లో బలమైన అభ్యర్థులనే నిలబెట్టాలని ఆ పార్టీ నేతలకు మాజీ సీఎం జగన్ సూచించారు. వైకాపా కేంద్ర కార్యాలయంలో నియోజకవర్గాల సమన్వయకర్తలు, ఇతర తరువాయి 2లో..

## ఎడిటోరియల్

### అటు సాయన్న.. ఇటు షర్మిలమ్మ..

# మధ్యలో జగనన్న!!

ఏపీ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రధానంగా మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి లక్ష్యంగా జరుగుతున్న రాజకీయాలు తీవ్ర ఆసక్తి రేపుతున్నాయి. ఒకప్పుడు జగన్ రెడ్డికి కుడి, ఎడమ భుజాల్లా పనిచేసిన ఇద్దరు ముఖ్యులు ఇప్పుడు ఆయనతో విభేదించడమే కాకుండా, తీవ్ర పదజాలంతో విమర్శలు ఎక్కుపెట్టడం హీట్ పుట్టిస్తోంది. ఈ పరిణామాలు గమనిస్తే మాజీ సీఎం జగన్ రెడ్డిని రాజకీయంగా దెబ్బతీసే అన్ని శక్తులు ఏకం అవుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ పరిస్థితుల్లో మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి తన ప్రత్యర్థులు నుంచి ఎదురవుతున్న సవాళ్లను ఎలా అధిగమిస్తారనేదే పెద్ద సస్పెన్స్ గా మారిందని అంటున్నారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజకీయ వారసుడిగా రాజకీయాల్లోకి వచ్చిన వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహనరెడ్డి తన కెరీర్ లో ఎప్పుడూ చూడని గడ్డు పరిస్థితులను ప్రస్తుతం అనుభవిస్తున్నారని అంటున్నారు. 2011లో కాంగ్రెస్ పార్టీతో విభేదించి సొంత పార్టీ పెట్టుకున్న జగన్ రెడ్డి 2024 వరకు రాష్ట్ర రాజకీయాల్లో ఒక బలమైన శక్తిగా నిరూపించుకున్నారు. అయితే 2024 ఎన్నికల ముందు నుంచి తాజాగా చోటుచేసుకుంటున్న పరిణామాలను గమనిస్తే మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డిని రాజకీయంగా దెబ్బతీసేలా ప్రత్యర్థులు శరవేగంగా పావులు కదుపుతున్నారని అంటున్నారు. జగన్ రెడ్డికి తోడునీడగా నిలిచిన సోదరి వైఎస్ షర్మిల 2024 ఎన్నికలకు ముందు ఆయనకు రాజకీయ ప్రత్యర్థిగా మారడం ద్వారా పెద్ద సవాలు విసిరితే, ఇప్పుడు జగన్ రెడ్డికి అత్యంత సన్నిహితుడైన మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కూడా నేను సైతం అన్నట్లు కాలు దువ్వుతున్నారని అంటున్నారు. 2024 ఎన్నికల్లో పార్టీ ఓటమి తర్వాత రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించిన విజయసాయిరెడ్డి తాజాగా కొత్త పార్టీ పెడతానని ప్రకటించారు. అంతేకాకుండా పార్టీ పేరు ప్రకటించకముందే జగన్ రెడ్డి టార్గెట్ గా ఘాటు విమర్శలు చేస్తున్నారు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున మత మార్పిడులు జరిగాయని, అందుకు జగన్ రెడ్డి కారణం అన్నట్లు విజయసాయిరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇప్పటివరకు జగన్ రెడ్డిపై ఏ రాజకీయ పార్టీ కానీ, నాయకుడు కానీ ఈ తరహా చేయలేదని పరిశీలకులు గుర్తు చేస్తున్నారు. షర్మిల కాంగ్రెస్ చీఫ్ గా పనిచేస్తుండగా, విజయసాయిరెడ్డి కొత్త పార్టీతో రాజకీయాల్లో సత్తా చాటుతానని అంటున్నారు. ఈ ఇద్దరు ప్రధానంగా వైసీపీ అధినేత జగన్ రెడ్డినే టార్గెట్ చేస్తుండటం హాట్ టాపిక్ అవుతోంది. సొంత కుటుంబ వ్యవహారాలు, ఆస్తుల వివాదాలతోపాటు రాష్ట్ర రాజకీయాలల్లోనూ జగన్ రెడ్డి వైఫల్యాలపైనే షర్మిల ఎక్కువగా మాట్లాడుతున్నారని వైసీపీ నేతలు విమర్శలు చేస్తున్నారు. అయినప్పటికీ ఆమె మాటల దాడిని అడ్డుకోలేకపోతున్నారని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పుడు షర్మిలకు తోడుగా విజయసాయిరెడ్డి జత కలవడం ద్వారా వైసీపీని ఇరుకన పెట్టేలా ప్రత్యర్థులు వ్యూహరచన చేస్తున్నారా? అన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మొత్తానికి మాజీ సీఎం జగన్ రెడ్డికి ఇరువైపులా షర్మిల, విజయసాయిరెడ్డి మోహరించి, నేరుగా ఆయనపైనే యుద్ధం అన్నట్లు మాటల దాడి చేస్తుండటం రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీస్తోంది. ఈ ఇద్దరు ఒకప్పుడు వైసీపీలో క్రియాశీలంగా పనిచేయడమే కాకుండా మాజీ ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులుగా, అత్యంత సన్నిహితులుగా ప్రజలలో గుర్తింపు ఉండటం వల్ల వారి మాటలకు విలువ ఉంటోందని అంటున్నారు. జగన్ రెడ్డి ప్రత్యర్థులకు మేలు చేసేలా ఈ ఇద్దరు వేస్తున్న అడుగులను జగన్ రెడ్డి వ్యూహాత్మకంగా అడ్డుకోవాల్సివుందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. లేనిపక్షంలో వైసీపీ రానున్న రోజుల్లో అనేక సవాళ్లను ఎదుర్కోవాల్సివస్తుందని హెచ్చరిస్తున్నారు.

# 30 ఏళ్ల సంకల్పం సాకారం..

తన ఆనందాన్ని పంచుకున్నారు. ఈ చారిత్రక ఘట్టానికి మార్కాపురం జిల్లా వేదిక కానుందని, ఈ సందర్భంగా నల్లమల సాగర్‌లోకి 10.7 టీఎంసీల కృష్ణా జలాలను విడుదల చేయనున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. ఎన్నో అవాంతరాలు, సవాళ్లను అధిగమించి భగీరథ ప్రయత్నంతో వెలిగొండ ఫేజ్-1ను పూర్తి చేసి కరవు నేలకు కృష్ణమ్మ జలాలను అందిస్తున్నామని తెలిపారు. మూడు దశాబ్దాల క్రితం తాను తీసుకున్న సంకల్పం నేడు సాకారమైందని, తీవ్ర కరవు ప్రాంతమైన ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజల జీవితాల్లో ఇది గొప్ప మార్పు తీసుకువస్తుందని అన్నారు. ఈ మేరకు 1996 మార్చి 5న తాను శంకుస్థాపన చేసిన నాటి ఫొటోను ప్రస్తుత ట్వీట్‌కు జత చేశారు. ఈ ప్రాజెక్టుతో తరతరాలుగా కరవుతో పోరాడుతున్న ప్రజలకు శాశ్వత ఉపశమనం కలుగుతుందని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు. ఫేజ్-1తో 1.19 లక్షల ఎకరాలకు, ఫేజ్-2 పూర్తయితే మరో 3.28 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని వివరించారు. కేవలం సాగునీరే కాకుండా, ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందించి, పశ్చిమ ప్రకాశం ప్రాంతాన్ని పట్టిపీడిస్తున్న ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని భరోసా ఇచ్చారు. "దుర్భిక్ష ప్రాంతమైన మార్కాపురానికి వెలిగొండ ఒక వెలుగుల దండ అవుతుంది" అని ఆయన అభివర్ణించారు. ప్రాజెక్టుతో పాటు ఈ ప్రాంత సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని చంద్రబాబు పునరుద్ఘాటించారు. రాయలసీమ, ఉమ్మడి ప్రకాశం జిల్లాలను హార్టికల్చర్ హబ్‌గా మార్చేందుకు రూ.1 లక్ష కోట్లతో పనులు ప్రారంభిస్తామని ప్రకటించారు. బెంగళూరు-అమరావతి హైవే, రామాయపట్నం పోర్టులతో వాణిజ్య, పారిశ్రామిక అభివృద్ధికి కొత్త ద్వారాలు తెరుస్తామని చెప్పారు. "ప్రతి రైతు పొలానికి నీరు, ప్రతి యువకుడికి ఉపాధి, ప్రతి కుటుంబానికి భరోసా... ఇదే 'సీబీఎన్ అనే నేను' సంకల్పం" అని చంద్రబాబు తన ట్వీట్‌లో స్పష్టం చేశారు. ప్రతి పౌరుడూ 'నేను...' అనే స్ఫూర్తితో పనిచేసి జాతి నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

# రాయలసీమకు సుజ్లాన్ భరోసా..

రూ.10,000 కోట్ల భారీ పెట్టుబడితో నెలకొల్పనున్న విండ్ ఎనర్జీ ప్రాజెక్టులకు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా వెనుకబడిన రాయలసీమ ప్రాంతంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 4,000 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. రాయదుర్గం నియోజకవర్గంలోని కనేకల్లు మండలం, హులికెర గ్రామం వద్ద ఈ భారీ ప్రాజెక్టుకు అంకురార్పణ జరిగింది. మొత్తం 1,325 మెగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటు చేయనున్న ఈ పవన విద్యుత్ ప్రాజెక్టులను రాయదుర్గం, ఉరవకొండ, కళ్యాణదుర్గం నియోజకవర్గాల పరిధిలో రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో అభివృద్ధి చేయనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా, సుజ్లాన్ సంస్థ నూతనంగా ఏర్పాటు చేసిన 'ఎస్144 న్యూ బ్లేడ్ ప్రొడక్షన్ లైన్స్'ను కూడా మంత్రి లోకేశ్ అధికారికంగా ప్రారంభించారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించి, ప్రాజెక్టుకు సంబంధించిన ఆడియో విజువల్ (ఏవీ) ప్రదర్శనను వీక్షించారు. అంతకుముందు బళ్లారి సమీపంలోని హలకుంది గ్రామంలో ఉన్న సుజ్లాన్ బ్లేడ్ స్టాక్ యార్డును మంత్రి సందర్శించి, అక్కడి విండ్ టర్బైన్‌పై తన సంతకం చేశారు. ఈ సందర్భంగా సుజ్లాన్ ప్రతినిధులు ప్రాజెక్టు విశేషాలను మంత్రికి వివరించారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో 1,700 మెగావాట్లకు పైగా స్థాపిత సామర్థ్యంతో అతిపెద్ద విండ్ భాగస్వామిగా ఉన్న సుజ్లాన్, తన కార్యకలాపాలను మరింత విస్తరిస్తోంది. 2030 నాటికి రాష్ట్రంలో అదనంగా మరో 5,000 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులను స్థాపించడమే లక్ష్యంగా వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. పవన విద్యుత్ ఉత్పత్తిలో ఏపీని కీలక కేంద్రంగా మార్చేందుకు ఈ ప్రాజెక్టులు దోహదపడతాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కీలక కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, అనంతపురం ఎంపీ అంబికా జి. లక్ష్మీనారాయణ, స్థానిక ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు (రాయదుర్గం), అమిలినేని సురేంద్రబాబు (కళ్యాణదుర్గం), దగ్గుపాటి వెంకట ప్రసాద్ (అనంతపురం అర్బన్) పాల్గొన్నారు. సుజ్లాన్ గ్రూప్ తరఫున కో-ఫౌండర్, వైస్ ఛైర్మన్ గిరీష్ తంతి, సీఈవో అజయ్ కపూర్, అడ్వైజర్ వి.బి. రావు, ఇతర భాగస్వామ్య సంస్థలైన టాటా పవర్ ఎండీ సంజయ్ బంగా, టోరెంట్ పవర్ డైరెక్టర్ జిగీష్ మెహతా, వారీ ఎనర్జీస్ సీఎండీ హితేష్ దోషి, ఎన్ఆర్ఈడీసీఏపీ లిమిటెడ్ వీసీ, ఎండీ ఎమ్. కమలాకర బాబు, జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ తదితర ప్రముఖులు హాజరయ్యారు.

# 463కి.మీల దూరం నుంచే కూల్చేస్తుంది..

సాంకేతిక పేరు వీ-424. రేథియాన్ సంస్థతో కలిసి అమెరికా నౌకాదళం అత్యాధునిక ఎయిర్-టు-ఎయిర్ క్షిపణిని అభివృద్ధి చేసింది. పొడవు 4.11 మీటర్లు.. 680 కిలోల బరువుండే ఈ క్షిపణిలో సాలిడ్ ప్రొపెల్లెంట్ రాకెట్ మోటార్ ప్రొపల్షన్ అమర్చారు. దీని సాంకేతికతను యూఎస్ నేవీ పూర్తిగా బయటపెట్టనప్పటికీ.. శత్రువు టార్గెట్‌ను గుర్తించిన వెంటనే.. దాన్ని కూల్చివేసేలా రూపొందించారు. 250 నాటికల్ మైళ్ల (463 కిలోమీటర్ల) దూరంలో ఉండే లక్ష్యాలను ఇది ఛేదించగలదు. గగనతల లక్ష్యాలను టార్గెట్ చేసే క్షిపణిల్లో ఇదే ఇప్పటివరకు అత్యంత లాంగ్ రేంజ్ మిసైల్. దీంతో అమెరికా యుద్ధ విమానాలు లక్ష్యాలకు చేరువగా వెళ్లాల్సిన పని ఉండదు. అప్పుడు యుద్ధ క్షేత్రంలో అగ్రరాజ్యం వైపు తక్కువ నష్టం ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు.

**ఏ యుద్ధ విమానాల్లో వాడుతారు?**

ఏఐఎం-424 క్షిపణిని ప్రధానంగా ఎఫ్-35సీ యుద్ధ విమానాల కోసం డిజైన్ చేశారు. దీంతో పాటు సూపర్ హార్నెట్ ఫైటర్ జెట్లలోనూ వీటిని అమర్చేందుకు కూడా పరీక్షలు జరుపుతున్నారు. ఇటీవల జరిగిన టెస్ట్ ఈవెంట్‌లో ఈ క్షిపణులను యుద్ధ విమానాలకు అమర్చిన ఫొటోలను అమెరికా నేవీ విడుదల చేసింది.

**టార్గెట్స్ ఇవే..:** శత్రుదేశ యుద్ధ విమానాలు, దీర్ఘ శ్రేణి బాంబర్లు, గగనతల నియంత్రణ విమానాలు, ఇంటెలిజెన్స్, నిఘా, గూఢచర్య విమానాలు, ఏరియల్ రీఫ్యుయలింగ్ ట్యాంకర్లు, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ ఎయిర్‌క్రాఫ్ట్‌లను ఈ క్షిపణులు లక్ష్యంగా చేసుకుంటాయని అగ్రరాజ్యం వెల్లడించింది. ప్రస్తుతానికి ఈ క్షిపణిని నేవీ ఆవిష్కరించినా.. వాటిని ఎప్పుడు, ఎక్కడ వినియోగిస్తారన్న వివరాలను మాత్రం అమెరికా బయటపెట్టలేదు.

**'వేల మైళ్ల'పై చైనా గురి..:** మరోవైపు, చైనా కూడా ఇలాంటి దీర్ఘశ్రేణి క్షిపణులపై దృష్టి పెట్టింది. వేల మైళ్ల దూరంలో ఉన్న గగనతల లక్ష్యాలను ఛేదించే హైపర్‌సోనిక్ గ్లైడ్ వెహికల్స్‌ను తయారుచేస్తున్నట్లు సమాచారం. ఈ క్షిపణులు దాదాపు 2414 కిలోమీటర్ల ప్రయాణించగలవని అంచనా. అంటే.. చైనా నుంచి అమెరికా గగనతలాన్ని లక్ష్యంగా చేసుకోవచ్చని సమాచారం. అయితే, ఈ క్షిపణికి సంబంధించిన వివరాలు ఇంకా బయటకు రాలేదు. ప్రస్తుతం బీజింగ్ వద్ద కనీసం 3150 బాలిస్టిక్ క్షిపణులు, 300 గ్రౌండ్ క్రూజ్ మిసైళ్లు ఉన్నాయని అంచనా.

# పైలట్ల డ్రగ్ టెస్టులపై కొత్త రూల్...

పరీక్షలు నిర్వహిస్తుండగా, ఈ విధానాన్ని మార్చేందుకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) కసరత్తు చేస్తోందని ఆయన వెల్లడించారు. మంగళవారం ఢిల్లీలో విలేకరులతో మాట్లాడిన రామ్మోహన్ నాయుడు, ప్రతిపాదిత నూతన విధానం ప్రకారం ప్రతి పైలట్‌కు ఏడాదికి ఒకసారి ఏదో ఒక సమయంలో విధిగా డ్రగ్ టెస్ట్ నిర్వహించాల్సి ఉంటుందని వివరించారు. ఈ విధానం అమలు వల్ల కలిగే భద్రతా ప్రయోజనాలు, కార్యాచరణపరమైన అంశాలపై డీజీసీఏ భాగస్వామ్య పక్షాలతో చర్చిస్తోందని, ఆ తర్వాత తుది నిర్ణయం తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఈ నెలలో చోటుచేసుకున్న ఎయిర్ ఇండియా ఫుకెట్-ఢిల్లీ విమాన ఘటన నేపథ్యంలో విమానయాన భద్రతా నిబంధనలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఆగస్టు 4న జరిగిన ఈ ఘటనలో విమానం అకస్మాత్తుగా ఎత్తు కోల్పోవడంతో 17 మంది గాయపడ్డారు. ఆ తర్వాత సదరు పైలట్ డ్రగ్ టెస్టులో పాజిటివ్‌గా తేలినట్లు వార్తలు వచ్చాయి. ఈ ఘటనపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) విచారణ జరుపుతోందని, త్వరలోనే ప్రాథమిక నివేదిక వెలువడవచ్చని మంత్రి తెలిపారు. ఈ ఘటన అనంతరం ఎయిర్ ఇండియా తమ పైలట్లకు డ్రగ్ స్క్రీనింగ్‌ను మరింత విస్తృతం చేసింది. మరోవైపు, అమెరికా, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో వినియోగిస్తున్న వేగవంతమైన లాలాజల ఆధారిత డ్రగ్ టెస్టింగ్ పద్ధతులను పరిగణనలోకి తీసుకోవాలని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ పైలట్స్ డీజీసీఏను కోరింది.

### ప్రధాని మోదీకి రాహుల్, ఖర్గే లేఖ..

# కులగణనపై కీలక సూచన

మార్చి.. కులాల పేర్లతో కూడిన డ్రాప్‌డౌన్ జాబితాను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ప్రస్తుత విధానంలో వ్యక్తులు తమ కులం పేరును ఎలా చెబితే అలా నమోదు చేస్తారని ఖర్గే, రాహుల్ పేర్కొన్నారు. ఒకే కులానికి ప్రాంతాలను బట్టి వేర్వేరు పేర్లు, ఉపకులాలు, భాషా రూపాలు ఉండే అవకాశం ఉందని తెలిపారు. దీంతో ఒకే కులానికి చెందినవారి వివరాలు వేర్వేరు పేర్లతో నమోదైతే.. ఆ కులం వేలాది ఎంట్రీలుగా విడిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలా జరిగితే కులాల జనాభాపై కచ్చితమైన సమాచారం లభించదని తెలిపారు. ఫలితంగా వెనుకబడిన, అత్యంత వెనుకబడిన, ఇతర అణగారిన వర్గాల స్థితిగతులపై సరైన అంచనా సాధ్యం కాదన్నారు. విద్య, ఉద్యోగాలు, సంక్షేమ పథకాలు, సామాజిక న్యాయానికి సంబంధించిన నిర్ణయాలపై దీని ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా దేశంలో ఓబీసీల వాస్తవ జనాభా ఎంత అన్నది కూడా తేలకపోవచ్చని కాంగ్రెస్ నేతలు అన్నారు. కులగణనలో 'బ్యాక్‌వర్డ్ క్లాస్' అనే పదం చేర్చలేదని లేఖలో ప్రస్తావించారు. కులాల పేర్లతో డ్రాప్‌డౌన్ జాబితా రూపొందించాలని వారు సూచించారు. ఎస్సీ, ఎస్టీల గణనలో ఇదే విధానాన్ని అనుసరిస్తున్నారని తెలిపారు. సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాల ప్రభుత్వ జాబితాలు, ఆంత్రోపాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా వివరాల ఆధారంగా ఈ జాబితాను రూపొందించవచ్చన్నారు. తెలంగాణ, బీహార్ కుల సర్వేల్లోనూ ఇదే విధానాన్ని అనుసరించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుత ప్రశ్నావళిని రద్దు చేసి.. రాజకీయ పార్టీలు, నిపుణులు, ప్రజలతో సంప్రదింపులు జరిపిన తర్వాత కొత్త ప్రశ్నావళిని రూపొందించాలని ఖర్గే, రాహుల్ కోరారు.

## మొదటి పేజీ తరువాయి

### 'గ్రేట్ గ్రీన్ వాల్' కార్యక్రమంలో భాగంగా తాటి వనాలను పెంచే కార్యక్రమం ప్రారంభమైంది

చుట్టారు. ప్రకృతి విపత్తులు, తుపాన్లు సంభవించినప్పుడు ఉగ్రరూపం దాల్చే ఈదురుగాలుల నుంచి తీరప్రాంత గ్రామాలకు ఈ తాటివనాలు ఒక సహజ రక్షణ గోడలా పనిచేస్తాయని పవన్ కల్యాణ్ తెలిపారు. తీరప్రాంతాల్లో ప్రత్యేకంగా తాటిచెట్లనే ఎంచుకోవడానికి గల కారణాలను వివరిస్తూ... ఉప్పునీరు, హోరు గాలులు ఉండే కఠినమైన తీరప్రాంత వాతావరణాన్ని తట్టుకుని నిలబడే శక్తి తాటిచెట్లకు మాత్రమే ఉంటుందన్నారు. ఇసుక, బుసక, ఉప్పు నేలలతో పాటు ఒండ్రు నేలల్లో సైతం ఇవి పెరుగుతాయని పేర్కొన్నారు. తాటిచెట్లు బాగా ఎత్తుగా పెరిగే లక్షణం కలిగి ఉండటం వల్ల సముద్ర గాలులను సమర్థవంతంగా అడ్డుకుంటాయని, అంతేకాకుండా వీటి వేర్లు నేలను బలంగా పట్టి ఉంచడం ద్వారా తీరం కోతకు గురికాకుండా కాపాడుతాయని ఉపముఖ్యమంత్రి వివరించారు.

### 12, 13 తేదీల్లో భారత్‌కు షీ జిన్‌పింగ్!

అవుతుంది. కాగా భారత జాతీయ భద్రత సలహాదారు అజీత్ డోభాల్ సోమవారం చైనా రాజధాని బీజింగ్‌కు చేరుకున్నారు. ఆయన రెండు రోజులపాటు ఆ దేశంలో పర్యటించనున్నారు. సరిహద్దు అంశాలపై మంగళవారం జరిగే రెండు దేశాల ప్రత్యేక ప్రతినిధుల సమావేశంలో పాల్గొంటారు. చైనా విదేశాంగశాఖ మంత్రి, జాతీయ భద్రత సలహాదారు అయిన వాంగ్ ఈ తోనూ ఆయన సమావేశమవుతారు.

### రష్యాలో దిగిన అమెరికా 'మిస్టరీ' విమానం

అమెరికాకు చెందిన ఓ సైనిక విమానం మంగళవారం రష్యా విమానాశ్రయంలో ల్యాండ్ అయ్యింది. దీంతో ఆ విమానం రాకకు గల కారణమేంటనే దానిపై నెట్టింట చర్చ మొదలైంది. ఫ్లైట్‌రాడార్ 24 డేటా ప్రకారం.. బోయింగ్ సీ-17 గ్లోబ్‌మాస్టర్ 3 విమానం లాత్వియా దేశ రాజధాని రిగా నుంచి ఉదయం 8.50 గంటలకు (స్థానిక కాలమానం ప్రకారం) బయల్దేరింది. ఉదయం 10 గంటల తర్వాత ఈ విమానం మాస్కోలోని అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగింది. ఆగస్టు 23న ఈ విమానం వాషింగ్టన్‌లోని యూఎస్ ఆండ్రూస్ ఎయిర్‌ఫోర్స్ బేస్ నుంచి రిగాకు చేరుకున్నట్లు తెలిసింది. ఇది సైనిక రవాణా విమానం. సాధారణంగా దీన్ని అమెరికా వాయుసేన సుదీర్ఘ ప్రయాణాలకు ఉపయోగిస్తుంది. ఇందులో సైనిక పరికరాలు, సిబ్బంది, ఇతరత్రా కార్గోను తరలిస్తుంటారు. అయితే, ప్రస్తుత యుద్ధ పరిణామాల నేపథ్యంలో ఈ విమానం మాస్కోకు రావడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ విమానం ఎందుకొచ్చింది..? అందులో ఎవరున్నారు..? వంటి వివరాలేవీ తెలియరాలేదు. దీనిపై అమెరికా నుంచి ఇంతవరకూ ఎలాంటి స్పందన రాలేదు. మరోవైపు, ఈ విమానం ల్యాండింగ్ గురించి తమకు సమాచారం లేదని రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ వెల్లడించింది. కాగా.. అమెరికా రక్షణమంత్రి పీట్ హెగ్సెత్ రష్యాలో పర్యటించే అవకాశం ఉందని కొద్ది రోజులుగా ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో సైనిక రవాణా విమానం ల్యాండ్ అవడం మిస్టరీగా మారింది. మాస్కో ఎయిర్‌పోర్టులో ఈ విమానం ల్యాండ్ అయిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

### స్థానికంలో ఏకగ్రీవాలు జరిగితే ఎమ్మెల్యే టికెట్ ఉండదు: జగన్

ముఖ్యనేతలతో ఆయన సమావేశమయ్యారు. స్థానిక ఎన్నికల్లో ఏకగ్రీవాలు జరిగితే ఆయా నియోజకవర్గ నేతలకు వచ్చే ఎన్నికల్లో టికెట్ ఉండదంటూ బెదిరింపు ధోరణిలో మాట్లాడారు. "ప్రభుత్వం స్థానిక ఎన్నికలు జరపాలని యోచిస్తోంది. మీ నియోజకవర్గాల్లో ఎక్కడైనా ఏకగ్రీవాలు జరిగితే తర్వాత ఎన్నికల్లో మీకు సీటు ఉండదు. ఆ నియోజకవర్గ నేత ఎమ్మెల్యే రేసులో ఉండరు" అని జగన్ వ్యాఖ్యానించారు.

#### పోలీసులు, విద్యార్థుల మధ్య ఘర్షణ..

### బిహార్‌లో ఉద్రిక్తత

మైదాన్ నుంచి సీఎం సమ్రాట్ చౌధరీ నివాసం వైపు ర్యాలీ చేపట్టారు. బారికేడ్లను దూకిన విద్యార్థులను పోలీసులు నిలువరించేందుకు యత్నించారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. నిరసనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీఛార్జి చేశారు. జల ఫిరంగులను ప్రయోగించారు. పలువురిని అదుపులోకి తీసుకున్నారు. పోటీ పరీక్షలు, నియామకాలకు సంబంధించిన వివిధ డిమాండ్లపై పట్నాలో విద్యార్థులు, ఉద్యోగార్థులు కొన్ని రోజులుగా నిరసనలు కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగానే ఈ ర్యాలీ నిర్వహించారు. సంబంధిత డిమాండ్లపై సోమవారమే విద్యార్థి ప్రతినిధులతో అధికారులు చర్చలు జరిపారు. అయితే.. ముఖ్యమంత్రి లేదా విద్యాశాఖ మంత్రితో చర్చలకు అనుమతించాలని విద్యార్థి ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.

**రెండు వారాల్లో లొంగిపోండి: తరుణ్ తేజ్‌పాల్‌కు 'సుప్రీం' ఆదేశం**

ఈ పరిణామాల నడుమ.. విద్యార్థుల సమస్యలను పరిష్కరించేందుకు 'విద్యార్థి సహయోగ శిబిరం' పేరుతో నెలవారీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ప్రకటించింది. ప్రతి నెలా నాలుగో మంగళవారం విద్యాసంస్థల్లో ఈ శిబిరాలను నిర్వహిస్తామని, విద్యార్థులు తమ సమస్యలను అధికారులకు నేరుగా తెలియజేసే అవకాశం లభిస్తుందని ముఖ్యమంత్రి తెలిపారు. అదేవిధంగా 1100 హెల్ప్‌లైన్ నంబరు ద్వారా ఫిర్యాదులను నమోదు చేయొచ్చని తెలిపారు.

# అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్ట్

### 8 మద్యం బాటిళ్లు స్వాధీనం



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఆగస్టు 25**

విశాఖ నగర పరిధిలోని భీమునిపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో అనుమతి లేకుండా అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఒక మహిళను పోలీసులు అరెస్టు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు సాగుతున్నాయన్న విశ్వసనీయ సమాచారం అందుకున్న భీమిలి పోలీసులు ఆ ప్రాంతంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో భాగంగా అక్రమంగా మద్యం అమ్ముతున్న మహిళను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఆమె వద్ద నుంచి మొత్తం 8 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అక్రమ కార్యకలాపాలపై తక్షణమే స్పందించి నిందితురాలిని పట్టుకున్న భీమునిపట్నం పోలీసు అధికారులను, సిబ్బందిని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, ప్రత్యేకంగా అభినందించారు.

## వైజాగ్ ఓపెన్ నేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో రుషికొండ మినర్వా స్కూల్ విద్యార్థులు



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్ ఆగస్టు 25**

విశాఖపట్నంలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో ఈ నెల 22, 23 తేదీల్లో నిర్వహించిన 3వ వైజాగ్ ఓపెన్ నేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో రుషికొండ మినర్వా స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి పలు పతకాలు సాధించారు. వివిధ విభాగాల్లో పోటీపడి మొత్తం 13 మంది విద్యార్థులు సిల్వర్, బ్రాంజ్ పతకాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు, తమ శిక్షకులకు గర్వకారణంగా నిలిచారు.

**విద్యార్థులు సాధించిన పతకాలు**

ఖాతా విభాగం, కుమితి విభాగం లో మెడల్ సాధించిన విద్యార్థులు బి .మనస్వి,పీ. మహేంద్ర సిల్వర్– బ్రాంజ్ మరియు డి. దీప్తి సిల్వర్ బ్రాంజ్,పి. శ్రీనివాస్ , వై. ఆకృతి, వి .సుకన్య , బి .యోగశ్రీ , పి.మానసి, జి. హర్షిత, ఎస్ .అభిరామ్, ఎం .బాలకృష్ణ విద్యార్థులు బ్రాంజ్ మోడల్ సాధించడం జరిగింది. విద్యార్థులు సాధించిన విజయంపై పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. క్రీడలతో పాటు విద్యలోనూ విద్యార్థులను ప్రోత్సహిస్తూ, వారి ప్రతిభను వెలికితీసేందుకు పాఠశాల యాజమాన్యం అందిస్తున్న సహకారం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సుశీల విద్యార్థులను అభినందిస్తూ, జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పతకాలు సాధించడం ఎంతో గర్వకారణమని విద్యార్థులకు శిక్షణ అందించిన పీటీ కె. ప్రేమలత ను విజేతల కు అభినందనలు తెలిపారు. కఠోర సాధన, క్రమశిక్షణ, పట్టుదలతో విద్యార్థులు సాధించిన ఈ విజయాలు ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తాయని పాఠశాల యాజమాన్యం పేర్కొంది.

## గాజువాక పోలీసులకు బీజేపీ ఫిర్యాదు

### కాకినాడ ఏఈ కుటుంబం ఆత్మహత్య ఘటనపై సమగ్ర దర్యాప్తు చేయాలని డిమాండ్

**గాజువాక, సిటిజన్ టైమ్స్, ఆగస్టు 25::**

కాకినాడ జిల్లాలో పంచాయతీరాజ్ ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్య ఘటనపై గాజువాక పోలీస్ స్టేషన్‌లో భారతీయ జనతా పార్టీ నాయకులు ఫిర్యాదు చేశారు.మహిళా మోర్చా ఆధ్వర్యంలో ఏపీ మీడియా ప్యానలిస్ట్, గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు,మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు రోహిణి తదితరులు సీఐ వాసు నాయుడుకు ఫిర్యాదు కాపీని అందజేశారు.ఈ సందర్భంగా నరసింగరావు మాట్లాడుతూ ఏఈ కుటుంబం ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులపై సమగ్ర విచారణ జరిపి, ప్రధాన నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న సాధిక్ ఖాన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని వారు పోలీసులను కోరారు. ఈ ఘటనలో 'లవ్ జిహాద్' కోణంపై కూడా పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. యువతులను మోసం చేయడం, వేధింపులకు గురిచేయడం, కుటుంబాలను బెదిరించడం వంటి ఆరోపణలు వెలుగులోకి వస్తున్న నేపథ్యంలో పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేపట్టాలని కోరారు.కేసును కేవలం కుటుంబ వివాదం లేదా వ్యక్తిగత వ్యవహారంగా కాకుండా వెలుగులోకి వచ్చిన ఆరోపణలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని లోతైన దర్యాప్తు చేయాలని కోరారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని వారు పోలీసులను డిమాండ్ చేశారు.కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కట్టా పద్మ,కృష్ణంరాజు,గూటూరు శంకరరావు, సిరసపల్లి నూకరాజు , వర్రి లలిత , పావని, ఈశ్వరరావు, మహేష్, కృష్ణారెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



# విశాఖ విమానాశ్రయ కార్మికులకు తక్షణ న్యాయం చేయాలి

### ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతో భేటీలో బి.వి.రామ్ డిమాండ్

### 170 కుటుంబాలకు పూర్తిస్థాయి సెటిల్‌మెంట్ ప్రకటించాలి -విశాఖ ఎయిర్‌పోర్టు కార్యకలాపాలు కొనసాగించాలి

### 48 గంటల్లో ప్రభుత్వం స్పందించకపోతే పోరాటం ఉధృతం చేస్తామని సంఘాల హెచ్చరిక.

**విశాఖపట్నం, ఆగస్టు 25:(సిటిజన్ టైమ్స్ ):**

విశాఖ విమానాశ్రయంలో దాదాపు రెండు దశాబ్దాలుగా సేవలందిస్తున్న 170 మంది కార్మికుల కుటుంబాలను రోడ్డున పడేయడం ప్రభుత్వానికి తగదని, వారికి వెంటనే పూర్తి స్థాయి సెటిల్‌మెంట్ కల్పించాలని తెలుగు శక్తి అధినేత బి.వి.రామ్ డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలపై మంగళవారం ఆయన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కార్యాలయంలో భేటీ అయ్యారు. తమ ఆందోళన తొమ్మిదో రోజుకు చేరిందని, భోగాపురం విమానాశ్రయం పేరుతో కార్మికుల జీవితాలతో చెలగాటమాడటం సరికాదని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ అంశాన్ని ప్రత్యేకంగా పరిగణనలోకి తీసుకుని, కార్మికులకు తక్షణ న్యాయం జరిగేలా చొరవ చూపాలని కోరారు. భోగాపురం విమానాశ్రయం పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చే వరకు విశాఖ విమానాశ్రయాన్ని యథావిధిగా కొనసాగించేలా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని బి.వి.రామ్ కోరారు. ముఖ్యంగా ఉదయం మూడు గంటలు, సాయంత్రం మూడు గంటల పాటు ప్రయాణికుల రాకపోకలు, సరుకు రవాణా (ఫ్రైట్) కార్యకలాపాలు సాగేలా చర్యలు తీసుకుంటే నగర ప్రజలకు ఎంతో



సౌకర్యంగా ఉంటుందని, ప్రభుత్వానికి కూడా మేలు జరుగుతుందని వివరించారు. ఈ సమస్యను పక్కనపెట్టి కార్మికులను గాలికొదిలేస్తే పరిస్థితి మరింత తీవ్రమవుతుందని, ప్రభుత్వం వెంటనే కార్మిక ప్రతినిధులతో చర్చలు జరిపి వారి ఆందోళనలను నివారించాలని సూచించారు. ఈ సమస్యపై ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సానుకూలంగా స్పందిస్తూ, కార్మికుల పరిస్థితిని ముఖ్యమంత్రి, ప్రభుత్వ



ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. మరోవైపు, విమానాశ్రయ కార్మికుల ఆందోళనకు రాధా రంగా రాయల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు గదే బాలాజీ, ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్, జయభారత్ నగర్ గ్రామ అధ్యక్షులు బొగ్గు శ్రీను, డాక్టర్ పపూర్ నికుంజ్ సంఘీభావం ప్రకటించారు. 170 కుటుంబాలకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని పేర్కొన్న నేతలు, ప్రభుత్వం రాబోయే 48 గంటల్లో నిర్ణయం తీసుకోకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# శాంతినికేతన్ గ్లోబల్ స్కూల్‌లో ఘనంగా ఓణం వేడుకలు

### సంప్రదాయ దుస్తులు, సాంస్కృతిక నృత్యాలతో అలరించిన ఉపాధ్యాయులు, విద్యార్థులు

### సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణతోనే సమగ్ర వ్యక్తిత్వ వికాసం :డైరెక్టర్ షణ్ముఖరావు





**విశాఖపట్నం,సిటిజన్ టైమ్స్, ఆగస్టు 25:**

నగరంలోని ఎంవీపీ కాలనీ సెక్టార్--8 శాంతినికేతన్ గ్లోబల్ పాఠశాలలో ఓణం పండుగ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది కేరళ సంప్రదాయ దుస్తులు ధరించి ఉత్సాహంగా పాల్గొన్నారు. ముఖ్యంగా ఉపాధ్యాయులు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ వి.షణ్ముఖరావు, కరస్పాండెంట్ కె.సాయిచంద్రిక మాట్లాడుతూ, భారతదేశం విభిన్న భాషలు, సంస్కృతులు, సంప్రదాయాలు, పండుగలకు నిలయమని పేర్కొన్నారు. విద్యార్థులకు కేవలం పాఠ్యపుస్తకాల విజ్ఞానానికే పరిమితం చేయకుండా దేశంలోని వివిధ రాష్ట్రాల సంస్కృతులు, పండుగలు, కళారూపాల విశిష్టతను తెలియజేయడం విద్యలో కీలక భాగమని తెలిపారు. వివిధ ప్రాంతాల పండుగలను పాఠశాలలో నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి పట్ల గౌరవం, ఐక్యతా భావన, నైతిక విలువలు పెంపొందుతాయని వివరించారు. చిన్ననాటి నుంచే దేశ సంస్కృతి గొప్పతనాన్ని తెలియజేయడం ద్వారా విద్యార్థులను బాధ్యతాయుతమైన ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దవచ్చని యాజమాన్యం స్పష్టం చేసింది. కేరళ సంస్కృతికి ప్రతీకైన ఓణం విశిష్టతను, దాని వెనుక ఉన్న సామాజిక ఐక్యతా సందేశాన్ని విద్యార్థులకు ప్రత్యక్షంగా వివరించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని వెల్లడించారు. ఈ వేడుకల్లో డైరెక్టర్ వి.షణ్ముఖరావు, కరస్పాండెంట్ కె.సాయిచంద్రికతో పాటు ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భీమిలి మండలం విలీనం పై ఆలోచించాలి–భీమిలి ఎం పి పి వాసురాజు

### విలీనం చేసిన 10 ఏళ్లు మినహాయింపు కల్పించాలి



**భీమిలి సిటిజెన్ టైమ్స్ ఆగస్టు 25**

భీమిలి మండలం విలీనం పై ఒకసారి ఆలోచించాలని భీమిలి ఏం.పి.పి దంతులూరు వాసురాజ్ కోరారు. మంగళవారం చివరి మండల సర్వ సభ్య సమావేశాలు అనంతరం విలేకరులతో మాట్లాడుతూ గ్రామ సభలు నిర్వహించి హడావిడి గా విలీనానికి అధికార ప్రభుత్వం హడావిడి పడుతోందని ప్రజలు అవస్తలు పడతారని చెప్పారు. మండలం విలీనం తో చాలా సమస్యలు పరిష్కారం ప్రభుత్వం ఆలోచించాలని చెప్పారు. లేదా విలీనం తరువాత కొన్ని విషయాలు లో 10 ఇయర్స్ వరకు మినహాయింపు కల్పించాలని చెప్పారు. మండలంలో 2800 ఎకరాలు కల్టివేషన్ ల్యాండ్ విషయం ఏమిచేస్తారని ప్రశ్నించారు.. జీ.వి.ఏం.సి విలీనం తో వైకాంట్ ల్యాండ్ టాక్స్ విషయం స్పష్టం చేయాలని చెప్పారు. ల్యాండ్ కన్వర్షన్ పరిస్థితి చెప్పాలన్నారు. పనికి ఆహార పథకం ఉపాధి కార్మికులు విషయం ఆలోచించాలని చెప్పారు. అభివృద్ధి ప్రణాళిక ప్రకటించాలని వాసురాజు కోరారు. అభివృద్ధికి మేము ఆటంకం కాదని మండలం విలీనం చేసినప్పుడు ప్రాక్టికల్ విషయాలు పరిగణనలోకి తీసుకోవాలని ప్రజలకు ఇబ్బంది అసౌకర్యం కలగ రాదని వాసు రాజు చెప్పారు.

## మేయర్ ఎన్నికల్లో భారీ మెజారిటీ ఖాయం: గంటా

### పోటీలో నేను వద్దా అంటూ సరదా వ్యాఖ్య



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్ ఆగస్టు 24:**

జీవీఎంసీ ఎన్నికల్లో మేయర్ స్థానాన్ని భారీ మెజారిటీతో కైవసం చేసుకుంటామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఎంవీపీ కాలనీ క్యాంప్ కార్యాలయంలో మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ విశాఖ ప్రజలు సీఎం చంద్రబాబు నాయుడిని అభిమానిస్తారని, 2019 లో రాష్ట్రమంతా వైసీపీ హవా నడిచినప్పటికీ విశాఖలోని నాలుగు దిక్కులు ఆయన వెంట నడిచాయన్నారు. గత ఎన్నికల్లో గాజువాక, భీమిలి, పెందుర్తి అసెంబ్లీ స్థానాల నుంచి రాష్ట్రంలో మొదటి, రెండు, నాలుగవ అత్యధిక మెజారిటీలు సాధించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రభుత్వం ఐటీ, టూరిజం, రియల్ ఎస్టేట్ రంగాల్లో విశాఖను శరవేగంగా అభివృద్ధి చేస్తోందని చెప్పారు. జీవీఎంసీలో విలీనానికి అనుకూలంగా భీమిలి రూరల్, ఆనందపురం, పద్మనాభం, పెందుర్తి మండలాల్లోని 79 గ్రామ పంచాయతీల గ్రామ సభల్లో తీర్మానాలు చేస్తున్నారని చెబుతూ.. ఇంతకుముందే భీమిలి నియోజకవర్గానికి చెందిన 3 మండలాల్లో ఇదే నిర్ణయాన్ని లేఖ రూపంలో ఇచ్చామని పేర్కొన్నారు. భోగాపురం మండలాన్ని జీవీఎంసీలో కలపాలన్న ప్రతిపాదన గురించి ప్రస్తావిస్తూ ఈ విషయమై నెల్లిమర్ల ఎమ్మెల్యే మాధవి నాయకులతో చర్చించి తన నిర్ణయం చెబుతానని గతంలో చెప్పారన్నారు. భోగాపురం జీవీఎంసీలో కలిస్తే బాగుంటుందనేది వ్యక్తిగత అభిప్రాయమని చెప్పారు. తన తనయుడు గంటా రవితేజ మేయర్ రేసులో ఉన్నారా అని ప్రశ్నించగా.. నేను పోటీ చేయవద్దా? అని సరదాగా వ్యాఖ్యానించారు. అభ్యర్థి ఎంపికకు ఇంకా చాలా సమయముందని, అధిష్టానం నిర్ణయం శిరోధార్యమన్నారు. ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యానికి మించి డేటా సెంటర్ల ప్రతిపాదనలు వచ్చినా అంగీకరించేది లేదని మంత్రి నారా లోకేష్ ఇప్పటికే స్పష్టం చేశారని తెలియజేశారు. డేటా సెంటర్లకు అవసరమైన నీరు, విద్యుత్తు కోసం ప్రభుత్వ ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తుందన్నారు.

# మాన్సాస్ సమస్యను పరిష్కరించండి..!!

### - ఆ తరువాతే విలీనం - బోని గ్రామస్తులు అల్టిమేటం

### -15 ఏళ్లుగా నిలిచిపోయిన రిజిస్ట్రేషన్లు - తీవ్ర ఇబ్బందుల్లో రైతాంగం





**ఆనందపురం సిటిజన్ టైమ్స్ ఆగస్టు 25**

మండల పరిధిలోని బోని గ్రామంలో దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న మాన్సాస్ భూముల సమస్యను తక్షణమే పరిష్కరించి, రైతులకు పూర్తి స్థాయిలో న్యాయం చేసిన అనంతరమే గ్రామాన్ని జీవీఎంసీలో విలీనం చేసే అంశాన్ని పరిశీలించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. బోని గ్రామంలోని భూములకు 1923 నుంచి క్రమం తప్పకుండా రిజిస్ట్రేషన్లు జరిగేవని, అయితే గత 15 ఏళ్లుగా రెవెన్యూ అధికారులు రిజిస్ట్రేషన్లను నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. భూముల క్రయవిక్రయాలు నిలిచిపోవడంతో కుటుంబ అవసరాలు తీర్చుకునేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ముఖ్యంగా ఆడపిల్లల వివాహాలు, పిల్లల ఉన్నత విద్య, ఇతర అత్యవసర అవసరాలకు భూములను విక్రయించుకోలేని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు.

**రుణాలు అందక.. విద్యుత్తు కనెక్షన్లు నిలిచి..**

గతంలో తమ భూములపై బ్యాంకులు వ్యవసాయ రుణాలు మంజూరు చేసేవని, ప్రస్తుతం రెవెన్యూ శాఖ అధికారులు అడంగల్ ప్రతులు ఇవ్వకపోవడంతో బ్యాంకులు వ్యవసాయ రుణాలను నిలిపివేశాయని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా రెవెన్యూ అధికారులు ఫారం-3 ప్రతులు ఇవ్వకపోవడంతో వ్యవసాయ అవసరాల కోసం కొత్త విద్యుత్తు మోటారు కనెక్షన్లు పొందలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి అన్నదాత సుఖీభవ పథకం మంజూరవుతున్నప్పటికీ, భూములకు సంబంధించిన సమస్యల కారణంగా వ్యవసాయం చేయడం భారంగా మారిందని తెలిపారు.

**శాసనసభలో ప్రస్తావించినా..**

బోని గ్రామానికి చెందిన మాన్సాస్ భూముల సమస్యపై స్థానిక శాసనసభ్యుడు గంటా శ్రీనివాసరావు శాసనసభలో మూడుసార్లు ప్రస్తావించి సమస్య పరిష్కారానికి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారని గ్రామస్థులు తెలిపారు. అయినప్పటికీ జిల్లా స్థాయిలో సమస్య పరిష్కారానికి ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో పురోగతి కనిపించలేదని పేర్కొన్నారు.

**సమస్య పరిష్కారమే తొలి ప్రాధాన్యం..**

ప్రస్తుతం బోని గ్రామాన్ని జీవీఎంసీలో విలీనం చేసే అంశంపై అధికారులు ప్రజల అభిప్రాయాలను కోరుతున్నారని గ్రామస్థులు తెలిపారు. గ్రామాన్ని జీవీఎంసీలో విలీనం చేయడాన్ని తాము వ్యతిరేకించడం లేదని, అయితే ముందుగా దశాబ్దాలుగా తమను వేధిస్తున్న మాన్సాస్ భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ఈ సందర్భంగా మంగళవారం జరిగిన గ్రామ సభలో మాజీ సర్పంచ్ సూరాల సత్య వరప్రసాద్, మాజీ ఎంపీటీసీ బోని అప్పలనాయుడు మాట్లాడుతూ రైతులకు భూములపై హక్కులు, రిజిస్ట్రేషన్లు, అవసరమైన రెవెన్యూ పత్రాలు అందుబాటులోకి వచ్చిన అనంతరమే విలీన ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని కోరారు.

# విశాఖలో ఘనంగా 'ఆంధ్రప్రదేశ్ జానపద కళా వైభవం - 2026'

## జానపద కళాకారులకు వెన్నుదన్నుగా ఉంటాం: జీవీ రామచంద్రరావు

## ఘనంగా పురస్కారాల ప్రదానం, సావనీర్ ఆవిష్కరణ







**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఆగష్టు 25**

అంతర్జాతీయ జానపద దినోత్సవాన్ని పురస్కరించుకుని అభయ్ ప్రొడక్షన్స్ ఆధ్వర్యంలో సిరిపురంలోని వుడా చిల్డ్రన్స్ థియేటర్‌లో "ఆంధ్రప్రదేశ్ జానపద కళా వైభవం – 2026" వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన 35 ప్రసిద్ధ జానపద కళారూపాల బృందాలు, సుమారుగా 700మంది కళాకారులకు అభినందన పురస్కారాలు, ప్రశంసా పత్రాలు, మెమోంటోస్, ముఖ్య అతిథులు చేతుల మీదుగా అందజేశారు. ఇదే వేదికపై జానపద కళారూపాల ప్రత్యేక వెబ్‌సైట్‌తో పాటు సావనీర్ బుక్‌ను ప్రముఖులు ఆవిష్కరించారు.

**హాజరైన ప్రముఖులు..**

ఈ వేడుకల్లో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, పూర్వ ఫిల్మ్ సెన్సార్ బోర్డు మెంబర్ జీవీ రామచంద్రరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. గౌరవ అతిథులుగా మాజీ రాజ్యసభ సభ్యులు, పద్మభూషణ్ ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, ఎస్.ఆర్.కె.పి గ్రూప్ చైర్మన్ ఎమ్.ఎస్.ఎన్. రాజు, లీడర్ పత్రిక అధినేత వి.వి. రమణమూర్తి, తెలుగు పౌరాణిక పద్యనాటక కళాశారది మంగాదేవి తదితరులు విచ్చేశారు. కళారంగ సేవలకు గుర్తింపుగా పలువురు ప్రముఖులకు నిర్వాహకులు ప్రత్యేక పురస్కారాలను అందజేశారు.

**700 మంది కళాకారులకు భోజన సదుపాయం -- జీవీ రామచంద్రరావుకు ప్రశంసలు**

కార్యక్రమానికి విచ్చేసిన దాదాపు 700 మంది జానపద కళాకారులకు మాజీ ఫిల్మ్ సెన్సార్ బోర్డు మెంబర్ జీవీ రామచంద్రరావు స్వయంగా భోజన సదుపాయాలను సమకూర్చారు. కళాకారుల పట్ల ఆయన చూపిన ఔదార్యాన్ని వేదికపై ఉన్న అతిథులందరూ ప్రత్యేకంగా కొనియాడారు. అనంతరం జీవీ రామచంద్రరావు మాట్లాడుతూ, ప్రాచీన జానపద కళలను కాపాడుతున్న కళాకారులకు ఎల్లప్పుడూ తన వంతు సహాయ సహకారాలు ఉంటాయని, వారికి ఆర్థికంగా, ఆరోగ్యపరంగా అన్నివేళలా వెన్నుదన్నుగా నిలుస్తానని భరోసా ఇచ్చారు.

**అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు**

బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ట్రస్టీ చెరువు రామకోటయ్య చీఫ్ కన్వీనర్‌గా, మేడా మస్తాన్ రెడ్డి ఆహ్వాన కమిటీ తరపున వ్యవహరించగా, ధనుంజయ్ – అభయ్ ప్రొడక్షన్స్ ఆధ్వర్యంలో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. వివిధ ప్రాంతాల కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

## ఘనంగా ప్రారంభమైన భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ద్వితీయ సోపాన్ శిక్షణ శిబిరం

### ఐదు రోజుల పాటు సౌత్ కోస్ట్ రైల్వే క్యాంపింగ్ సెంటర్‌లో కొనసాగనున్న శిక్షణ





**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఆగష్టు 25**

భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విశాఖపట్నం జిల్లా ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రమశిక్షణ, సేవాభావాన్ని పెంపొందించే లక్ష్యంతో ఐదు రోజుల ద్వితీయ సోపాన్ శిక్షణ శిబిరం ఘనంగా ప్రారంభమైంది. జిల్లా విద్యాశాఖాధికారి మరియు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా చీఫ్ కమిషనర్ ఎన్. ప్రేమ్ కుమార్ ఆదేశాల మేరకు సౌత్ కోస్ట్ రైల్వే క్యాంపింగ్ సెంటర్ వేదికగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ నెల 25వ తేదీ నుండి 29వ తేదీ వరకు జరగనున్న ఈ కార్యక్రమంలో జిల్లాలోని పీఎం శ్రీ పాఠశాలలతో పాటు ఇతర పాఠశాలలకు చెందిన ప్రవేశ్ అర్హత సాధించిన స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించేందుకు ఈ శిక్షణ ఎంతగానో దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి దాసరి వేణుగోపాల్, జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్ మారుతి హరీష్ కుమార్ పర్యవేక్షణలో శిక్షణ తరగతులను పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు, ఉపాధ్యాయులు డి. సుభద్ర దేవి, ఎస్. హేమంత్, కె. శ్రావణి, వై. నంద కుమారి, దుర్గా ప్రసాద్, సతీష్, రామచంద్ర రెడ్డి, ఎస్. చిన్నతల్లి తదితరులు పాల్గొని విద్యార్థులకు అవసరమైన మార్గదర్శకాలను అందించారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ శిబిరంలో విద్యార్థులకు ప్రాథమిక చికిత్స, నాట్స్ వేయడం, క్యాంపింగ్ మెళకువలు వంటి వివిధ అంశాలపై సమగ్ర శిక్షణ ఇవ్వనున్నారు.

## వైభవంగా ఈదమ్మ పోచమ్మ బోనాలు





**సిటిజన్ టైమ్స్ నాగర్ కర్నూల్ ఆగస్ట్ 25**

నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని శ్రీ ఈదమ్మ పోచమ్మ దేవాలయంలో భక్తుల సందడి నెలకొంది. ప్రత్యేక పూజలు, మొక్కులు చెల్లించేందుకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దేవాలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, తమ కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా పూజారులు తెప్ప రవి, తెప్ప అశోక్, తెప్ప ఆనంద్, బాలకృష్ణ రాజు, బంగారయ్య తదితరులు భక్తులకు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. దేవాలయ కమిటీ సభ్యులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తుల రద్దీ దృష్ట్యా దేవాలయ పరిసరాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కమిటీ సభ్యులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. అమ్మవారి దర్శనం కోసం వచ్చిన భక్తులు ఆలయ నిర్వాహకుల ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు.

## పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

### జిల్లా ఎస్పీ డా. సంగ్రామ్ సింగ్ జి. పాటిల్ ఐ పీ ఎస్

**సిటిజన్ టైమ్స్ నాగర్ కర్నూల్ ఆగస్టు 25**




పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా ఎస్పీ డా. సంగ్రామ్ సింగ్ జి. పాటిల్ ఐ పీ ఎస్ పిలుపునిచ్చారు. నాగర్‌కర్నూల్ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం వన మహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. పోలీస్ కార్యాలయ ఆవరణలో మొక్క నాటిన అనంతరం ఎస్పీ మాట్లాడారు. పర్యావరణ సమతుల్యత కాపాడటం ప్రతి ఒక్కరి ప్రాథమిక బాధ్యతని, రాబోయే తరాలకు మంచి పర్యావరణాన్ని అందించాలని అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని, పర్యావరణ పరిరక్షణలో ప్రతి అడుగు ముందు తరాలకు మార్గదర్శకంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, ఏవో కృష్ణయ్య, సీఐ శంకర్ పాల్గొనగా, ఆర్ఐ జగన్, ఎస్సైలు రమేష్, రామ్‌లాల్, ఆర్ఎస్సైలు శివాజీ, గౌస్ పాషా, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కళ్యాణ మండపాల పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి

### భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు





**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఆగష్టు 25:**

కొమ్మాది, సాయిరాం కాలనీ కళ్యాణ మండపాలలో మిగిలిపోయిన పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన అధికారులు, స్థానిక నాయకులతో కలిసి ఈ రెండు కళ్యాణ మండపాల నిర్మాణాలను స్వయంగా పరిశీలించారు. గతంలో అసంపూర్తిగా ఉన్న ఈ నిర్మాణాల కోసం రూ.1.66 కోట్ల నిధులు మంజూరు చేయించడంతో దాదాపు అన్ని హంగులతో మండపాలు సిద్ధమయ్యాయని, అయితే ఫాల్ సీలింగ్, నీటి వసతి వంటి చిన్నపాటి పెండింగ్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అనంతరం జీవీఎంసీ 5వ వార్డులోని సాయిరాం కాలనీలో గంటా శ్రీనివాసరావు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. స్థానికులకు కరపత్రాలు పంపిణీ చేస్తూ, అభివృద్ధి మరియు సంక్షేమం రెండు కళ్లుగా ప్రభుత్వం పాలన సాగిస్తోందని వివరించారు. మహిళల కోసం స్త్రీ శక్తి, తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్ల వంటి పథకాలను అమలు చేస్తున్నామని, ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నప్పటికీ ప్రతి నెలా 1వ తేదీనే క్రమం తప్పకుండా పెన్షన్లు అందిస్తున్నామని తెలిపారు. ఆ తర్వాత చంద్రంపాలెంలో జరుగుతున్న బంగారమ్మ తల్లి ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని దర్శించుకున్న ఎమ్మెల్యే, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అక్కడ ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ వి.అయ్యప్ప నాయుడు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకట వాసులతో పాటు స్థానిక నాయకులు నాగోతి సత్యనారాయణ, మొల్లి లక్ష్మణరావు, గరే గుర్నాథ్, లొడగల జానకిరామ్, గడ్డి శ్రీను, కానూరు అచ్యుతరావు, బోయి శ్రీను, నాగోతి వెంకట్రావు, పిల్లా వెంకట్రావు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ఆనందపురం పీహెచ్ లో మానసిక ఆరోగ్యం పై అవగాహన కార్యక్రమం






**ఆనందపురం, సిటిజన్ టైమ్స్ ఆగస్టు 25**

మానసిక ఆరోగ్య సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి, బాధితులకు సకాలంలో తగిన వైద్య సేవలు అందించేందుకు ఆరోగ్య సిబ్బందికి అవగాహన కల్పించడం ఎంతో అవసరమని ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా. ఎస్.కె. షహనాజ్ సాదియా అన్నారు. వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో అమలు చేస్తున్న "సాంత్వన" మానసిక ఆరోగ్య ప్రాజెక్టులో భాగంగా మంగళవారం ఆనందపురం పీహెచ్సీలో ఆరోగ్య సిబ్బందికి ఒకరోజు మానసిక ఆరోగ్య అవగాహన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డా. ఎస్.కె. షహనాజ్ సాదియా శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వ్యక్తి సంపూర్ణ ఆరోగ్యానికి శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం కూడా అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. మానసిక సమస్యలను తొలిదశలో గుర్తించి అవసరమైన వైద్య సహాయం, కౌన్సెలింగ్ అందించడం ద్వారా సమస్యలు తీవ్రతరం కాకుండా చూడవచ్చన్నారు. మానసిక అనారోగ్యంపై సమాజంలో ఉన్న అపోహలు, వివక్షను తొలగించేందుకు ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వాసవ్య మహిళా మండలి ప్రాజెక్టు డైరెక్టర్ డా. ఎం. అబ్రహాం మాట్లాడుతూ, వివిధ రకాల మానసిక అనారోగ్యాలు, వాటి లక్షణాలు, ప్రారంభ హెచ్చరిక సంకేతాలు, చికిత్సా విధానాలు, మానసిక ఆరోగ్యంపై సమాజంలో ఉన్న అపోహలు తదితర అంశాలను వివరించారు. మానసిక సమస్యలతో జీవిస్తున్న వ్యక్తులను నిర్లక్ష్యం చేయకుండా కుటుంబ సభ్యులు, ఆరోగ్య సిబ్బంది, సమాజం కలిసి వారికి అవసరమైన సహకారం అందించాలని కోరారు. ఆనందపురం మండలంలో సాంత్వన ప్రాజెక్టు ద్వారా మానసిక ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కల్పించడం, కౌన్సెలింగ్ అందించడం, ఇంటి సందర్శనలు నిర్వహించడం, అవసరమైన వారిని ప్రభుత్వ మానసిక ఆరోగ్య ఆసుపత్రులకు అనుసంధానం చేయడం, చికిత్స కొనసాగించేందుకు సహకరించడం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు డా. అబ్రహాం తెలిపారు. ప్రాజెక్టు కోఆర్డినేటర్ హేమ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో మానసిక ఆరోగ్య సమస్యలను ముందుగా గుర్తించడంలో ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆర్ఎంపీలు, ఆరోగ్య విద్యావేత్తలు, ఇతర కమ్యూనిటీ ఆరోగ్య కార్యకర్తలు కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని అన్నారు. మానసిక సమస్యలతో బాధపడుతున్న వ్యక్తులను గుర్తించి, వారికి సరైన మార్గదర్శకత్వం అందించడం, కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించడం, అవసరమైనప్పుడు వైద్య సేవలకు అనుసంధానం చేయడం వంటి బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో 42 మంది ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆర్ఎంపీలు, ఆరోగ్య విద్యావేత్తలు మరియు ఇతర కమ్యూనిటీ ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు. మానసిక ఆరోగ్య సమస్యల గుర్తింపు, ప్రారంభ సంకేతాలు, చికిత్స, కుటుంబ సహకారం, రిఫరల్ సేవలు తదితర అంశాలపై వారు అవగాహన పొందారు. కార్యక్రమాన్ని సాంత్వన ప్రాజెక్టు సూపర్వైజర్ ఎం. నాగరాజు సమన్వయం చేశారు. ప్రాజెక్టు కౌన్సెలర్ రూప, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్రీనివాసరావు, హెల్త్ విజిటర్ పార్వతమ్మ, విజయ్ కుమార్ (×+చీూఖ మీూఔ విద్యార్థి) తదితరులు కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించారు.

## డూప్లికేట్ ఓట్ల తొలగింపుపై ప్రత్యేక దృష్టి సారించాలి

### వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ పరిశీలకులు పేడాడ రమణికుమారి





**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఆగష్టు 25:**

విశాఖపట్నం తూర్పు నియోజకవర్గ పరిధిలోని ఆరిలోవ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో 13వ వార్డు అధ్యక్షులు సత్యాల వెంకట్ ఆధ్వర్యంలో వార్డు బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు), ముఖ్య నాయకులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విశాఖపట్నం మహిళా విభాగం అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ పరిశీలకులు పేడాడ రమణికుమారి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎన్నికల కమిషన్ చేపట్టిన ఎస్.ఐ.ఆర్ సర్వేలో భాగంగా తూర్పు నియోజకవర్గంలో 13 వేలకు పైగా ఓటర్లు రెండుసార్లు నమోదైనట్లు గుర్తించామని, వీటిపై క్షేత్రస్థాయిలో పూర్తి వివరాలు సేకరించి అదనంగా ఉన్న ఓటును తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఎన్నికల అధికారులను కోరనున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో బూత్ లెవల్ ఏజెంట్లు ప్రత్యేక శ్రద్ధ వహించి పనిచేయాలని ఆమె దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ విభాగం అధికార ప్రతినిధి అల్లంపల్లి రాజబాబు, రాష్ట్ర బీసీ విభాగం కార్యదర్శి సత్యాల సాగరిక, తూర్పు మహిళా అధ్యక్షురాలు కె.శిరీష, రాష్ట్ర ఎస్సీ విభాగం ప్రధాన కార్యదర్శి గూడపాటి విక్టర్, రాష్ట్ర చేనేత విభాగం ప్రధాన కార్యదర్శి వానపల్లి ఈశ్వరరావు, వార్డు పరిశీలకులు వానపల్లి మంగరాజు, తూర్పు బీసీ విభాగం అధ్యక్షుడు బేతా దుర్గారావు, వార్డు బూత్ కమిటీ విభాగం అధ్యక్షుడు ప్రసంగి వాసుతో పాటు నాయకులు కాకర గోవింద్, విమల, అప్పలనాయుడు, పోలారావు, రాము, కామేష్, పర్వీన్, జానకిదేవి, కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తలతో భేటీ

**తాడేపల్లి: (సిటిజన్ టైమ్స్): ఆగస్టు: 25:**



స్థానిక ఎన్నికల్లో ఏకగ్రీవాలకు అస్కారమివ్వరాదని వైఎస్ జగన్మోహన్ రెడ్డి స్పష్టం చేశారు. నేతలతో తాడేపల్లి లోని పార్టీ కార్యకర్తలతో భేటీ అయ్యారు. ఎన్నికలను చంద్రబాబు నాయుడు స్వేచ్ఛగా జరగనిస్తారని అనుకోవటం లేదని జగన్ తెలిపారు. ఎంపీపీ, ఎం ఎన్ పి, చైర్మన్, మేయర్ ఎన్నికల్లో అధికారం దుర్వినియోగం చేస్తారని అన్నారు. ఎన్నికలను తేలికగా తీసుకోవద్దు. ప్రజలు కూటమికి వ్యతిరేకముగా తీర్పు ఇస్తారని, కార్యకర్తలు అండగా ఉండాలని సూచించారు.

# రోడ్డెక్కిన రేషన్ డీలర్లు




**ఏలూరు: (సిటిజన్ టైమ్స్): ఆగస్టు: 25:**
ఏలూరులో రేషన్ డీలర్లు రోడ్డెక్కారు,డీలర్లకు కమీషన్ పెంచాలని,పనిభారం తగ్గించాలని ,స్మార్ట్ పోన్ లు మంజూరుచేయాలని డీలర్లు మంగళవారం జిల్లా కలక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు ,ఈ సందర్భంగా జిల్లా రేషన్ డీలర్ల యూనియన్ నాయకులు రాజులపాటి గంగాధర్ మాట్లాడుతూ రాష్ట్రం లో 30 వేళా మంది రేషన్ డీలర్స్ ఉన్నారన్నారు,డీలర్లకు ప్రభుత్వం ఇచ్చే కమీషన్ కేవలం 6 వేలు మాత్రమే అన్నారు,ఎన్నో ఏళ్లుగా రేషన్ షాపులు నిర్వహిస్తూ ఏ పని చేయలేక గత్యంతరం లేని పరిస్థితుల్లో చావలేక బతుకుతుంటే ప్రభుత్వం రేషన్ డీలర్లే బియ్యం బాగ్ లు దించుకోవాలని బ్యాగ్ ల పై క్యూ ఆర్ కోడ్ నమోదు చేసుకోవాలని,ప్రతి రోజు ఎన్ని బ్యాగ్ ల బియ్యం పంపినిచేశారు, ఖాళీ అయిన బ్యాగ్ ల పై ఉన్న క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసి ప్రభుత్వానికి నివేదించాలని ఆదేశించడం, డీలర్ల పై అదనపు భారం పెంచడమే నని గంగాధర్ ఆవేదన వ్యక్తం చేశారు.

## అమరావతి ని క్వాంటంకంప్యూ టింగ్ కుగ్లోబల్ హబ్ గా తీర్చిదిద్దుతాం



**అమరావతి: (సిటిజన్ టైమ్స్): ఆగస్టు :25:**
ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని క్వాంటం టెక్నాలజీకి గ్లోబల్ నాలెడ్జ్ హబ్ గాఅభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని , పుర పాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి నారాయణ తెలిపారు. అమరావతిలో నిర్మాణంలో ఉన్న క్వాంటం వ్యాలీ ప్రాజెక్ట్ పనులను మంత్రి పరిశీలించారు. హైదరాబాద్ ను, ఐటి, ఐ టి ఈ ఎస్ రంగాలలో ప్రత్యేక గుర్తింపు పొందేల అభివృద్ధి చేసిన తరహాలోనే అమరావతిని క్వాంటం కంప్యూ టింగ్ రంగానికి ప్రధాన కేంద్రం గా తీర్చిదిద్దాలని ప్రభుత్వం సంకల్పించిందని మంత్రి పేర్కొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల నిమిత్తం సమీక్ష సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే

**జనసేన మరియు ఎన్డీఏకూటమి అభ్యర్థుల విజయమే**

**లక్ష్యంగా కార్యకర్తలంతా కృషి చేయాలని సూచించిన ఎమ్మెల్యే**



**ఉంగుటూరు: (సిటిజన్ టైమ్స్): ఆగస్టు: 25**
ఉంగుటూరు నియోజకవర్గం ఉంగుటూరు మండల పరిధిలోని జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శాసనసభ్యులు పత్సమట్ల ధర్మరాజు సమీక్ష సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎన్నికల సన్నద్ధతపై నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. గ్రామాల వారీగా పార్టీ పరిస్థితి, స్థానికంగా ఉన్న అంశాలు, ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తి ఉన్న నాయకుల వివరాలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. జనసేన పార్టీ మరియు ఎన్డీఏకూటమి తరఫున పోటీ చేసే అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా కార్యాచరణ రూపొందించుకుని పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. పవన్ కళ్యాణ్ నాయకత్వంలో, ఆయన ఆదేశానుసారం ప్రజల్లో నిరంతరం ఉంటూ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన మరియు ఎన్డీఏ కూటమి అభ్యర్థుల విజయానికి సమష్టిగా కృషి చేయాలని సూచించారు.

## తపాల శాఖలో ఇంటర్నేషనల్ మనీ ట్రాన్స్ఫర్ సేవలు

**సూపర్డెంట్ చెరుకూరి శ్రీనివాస్**

**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఆగస్టు 25**
భారత ప్రభుత్వం తపాల శాఖ అనుబంధ సంస్థ ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ ద్వారా రియామని ఇంటర్నేషనల్ మనీ ట్రాన్స్ఫర్ సేవలు ఇప్పుడు తపాల శాఖ లో అందుబాటులో ఉన్నాయని అమలాపురం డివిజన్ తపాలా శాఖ డివిజనల్ సూపరింటెండెంట్ చెరుకూరి శ్రీనివాస్ తెలియజేశారు. ఇంటర్నేషనల్ మనీ ట్రాన్స్ఫర్ సేవలు మీ గ్రామంలోని తపాలా శాఖ కార్యాలయంలో బ్రాంచ్ తపాల శాఖ పోస్ట్ మాస్టర్ వద్ద అతి సులభంగా పొందుకొనే సౌకర్యం కల్పించడం జరిగిందని, ప్రజలు విదేశాల నుండి నగదు పంపిణీ జరుపుకునే వాళ్లు సంబంధిత లబ్ధిదారు ఆధార్ పాన్, లావా దివి పిన్ నెంబర్ వివరాలతో మీ దగ్గరలోని పోస్ట్ ఆఫీస్ ను సందర్శించి ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవచ్చని తెలిపారు.

ria Money Transfer | इंडिया पोस्ट पेमेन्ट्स बैंक India Post Payments Bank

# గోదావరి జలాలతో ఉత్తరాంధ్రకు కొత్త వెలుగు

## పోలవరం ఎడమ కాలువ జలహారతి కార్యక్రమానికి సీఎం చంద్రబాబు రాక

## ఏర్పాట్లను పరిశీలించిన హోం మంత్రి అనిత.. అధికారులకు పలు సూచనలు

**పాయకరావుపేట,సిటిజన్ టైమ్స్ ఆగస్టు 25 :**
పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు అందించే చారిత్రాత్మక ఘట్టానికి ప్రభుత్వం సర్వం సిద్ధం చేస్తోంది. పోలవరం ఎడమ కాలువ జలహారతి కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లను ముమ్మరం చేసింది. పాయకరావుపేట మండలం సీతారాంపురం నుంచి పీఎల్పురం, పాయకరావుపేట ప్రాంతాల వరకు పోలవరం ఎడమ కాలువ ద్వారా నీటి విడుదలకు సంబంధించిన ప్రాంతాలను రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత పరిశీలించారు. జలహారతి కార్యక్రమానికి చేపడుతున్న ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమానికి వచ్చే ప్రజలు, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్తో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. కార్యక్రమ నిర్వహణ, నీటి విడుదల ప్రాంతం, భద్రత, ప్రజల సౌకర్యాలు తదితర అంశాలపై హోం మంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా నీటిని విడుదల చేయడం ఉత్తరాంధ్ర రైతాంగానికి ఎంతో మేలు చేసే చారిత్రాత్మక ఘట్టమని మంత్రి అనిత పేర్కొన్నారు. ఎన్నో సంవత్సరాలుగా రైతులు ఎదురుచూస్తున్న కల సాకారం



కాబోతోందన్నారు. పాయకరావుపేట నియోజకవర్గంలో సుమారు 35 వేల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. గోదావరి జలాల రాకతో ఉత్తరాంధ్రలో సాగు విస్తీర్ణం మరింత పెరగడంతో పాటు రైతులకు సాగునీటి భద్రత కలుగుతుందన్నారు. ప్రస్తుతం సూపర్ ఎల్నినో వంటి వాతావరణ పరిస్థితులను ఎదుర్కొంటున్న నేపథ్యంలో సాగునీటి లభ్యత రైతాంగానికి ఎంతో ఊరటనిస్తుందని హోం మంత్రి తెలిపారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలు అందుబాటులోకి వస్తే తాండవ, వరాహ, శారదా నదులకు కూడా నీటి లభ్యత పెరిగే పరిస్థితులు ఏర్పడతాయని



పేర్కొన్నారు. సీఎం చంద్రబాబుని 'అపర భగీరథుడు'గా అభివర్ణించిన అనిత.. ఎన్నో సంవత్సరాలుగా సాధ్యం కాని పనిని ఆయన సంకల్పంతో సాకారం చేస్తున్నారన్నారు. గోదావరి జలాలు ఉత్తరాంధ్ర పంట పొలాలకు చేరడం చరిత్రలో నిలిచిపోయే ఘట్టమని పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర ప్రజలు గోదావరి జలాలకు ఘన స్వాగతం పలకాలని ఆమె పిలుపునిచ్చారు.గోదావరి జలాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని హోం మంత్రి అనిత కోరారు. అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్,జాయింట్ కలెక్టర్ శౌర్య మాన్ పటేల్,పోలవరం ఇరిగేషన్ ఏసుబాబు, అడురోడ్డు రామలక్ష్మి పాల్గొన్నారు.

# గల్లంతైన మత్స్యకారుల కోసం గాలింపు ముమ్మరం

**- 15 కోస్ట్గార్డ్ నౌకలు, నాలుగు హెలికాప్టర్లతో విస్తృత సెర్చ్ ఆపరేషన్**

**- మయన్మార్, బంగ్లాదేశ్ సముద్ర అధికారులకు సమాచారం.. ఎలక్ట్రానిక్ నిఘా కొనసాగింపు**

**- డైమండ్ హార్బర్, సుందర్బన్స్ పరిసరాల్లోనూ గాలింపు విస్తరణ**

**- మత్స్యకారులను సురక్షితంగా తీసుకొచ్చేందుకు అన్ని అవకాశాలను వినియోగిస్తున్నాం: మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**



**అమరావతి:(సిటిజన్ టైమ్స్):ఆగస్టు 25:**
అమలాపురం ప్రాంతానికి చెందిన గల్లంతైన ఏడుగురు మత్స్యకారుల ఆచూకీ కోసం చేపట్టిన గాలింపు చర్యలను మరింత ముమ్మరం చేసినట్లు రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో భారత తీర రక్షక దళం నౌకాదళం, ఇతర సంబంధిత విభాగాలు సమన్వయంతో విస్తృత సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అమలాపురం పార్లమెంట్ సభ్యులు హరీష్ బాలయోగి మంగళవారం కేంద్ర రక్షణ మంత్రిని కలిసి గల్లంతైన మత్స్యకారుల కోసం కొనసాగుతున్న గాలింపు చర్యలపై చర్చించిన అనంతరం కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ భారత తీర రక్షక దళాన్ని మరింత అప్రమత్తం చేసిందని మంత్రి తెలిపారు. ఐసీజీ ప్రధాన కార్యాలయంలోని డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (ఆపరేషన్స్) ఆదేశాల మేరకు కోల్కతాలోని తూర్పు, ఈశాన్య కమాండ్లను కూడా కార్యాచరణలోకి తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. గాలింపు పరిధిని విస్తరించి, ఆపరేషన్ను వేగవంతం చేసేందుకు సమీప సముద్ర జలాల్లో ఉన్న 15 ఐసీజీ నౌకలు, నాలుగు హెలికాప్టర్లను మంగళవారం రంగంలోకి దించినట్లు మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. మెరైన్ రెస్క్యూ కోఆర్డినేషన్ సెంటర్ ఆధ్వర్యంలో ఎలక్ట్రానిక్ నిఘా ఏకకాలంలో కొనసాగుతోందన్నారు. గల్లంతైన పడవకు సంబంధించిన సమాచారం లేదా ఆచూకీ లభించే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని మయన్మార్, బంగ్లాదేశ్ సముద్ర అధికారులను కూడా అప్రమత్తం చేసినట్లు తెలిపారు. పడవ విదేశీ జలాల్లోకి కొట్టుకుపోయి ఉండవచ్చనే అవకాశంతో పాటు, ఇంజిన్లో సాంకేతిక లోపం కారణంగా సముద్రంలో ఎక్కడైనా నిలిచిపోయి ఉండవచ్చన్న కోణంలోనూ భారత తీర రక్షక దళం పరిశీలన జరుపుతోందని మంత్రి వివరించారు. ఎంఆర్సీసీ చేపడుతున్న ఎలక్ట్రానిక్ నిఘాతో పాటు వివిధ సముద్ర అధికారుల నుంచి అందుతున్న సమాచారాన్ని ఎప్పటికప్పుడు విశ్లేషిస్తున్నట్లు చెప్పారు. సముద్ర ప్రవాహాలు, గాలుల దిశ, వేగం, వాతావరణ పరిస్థితులతో పాటు మత్స్యకారులు సాధారణంగా చేపల వేటకు వెళ్లే మార్గాలను పరిగణనలోకి తీసుకుని గాలింపు కొనసాగిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. డైమండ్ హార్బర్, సుందర్బన్స్తో పాటు పరిసర సముద్ర ప్రాంతాల్లోనూ సెర్చ్ ఆపరేషన్ను విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, కేంద్ర ప్రభుత్వ విభాగాలతో సమన్వయం చేసుకుంటోందని అచ్చెన్నాయుడు చెప్పారు. గల్లంతైన మత్స్యకారులను సురక్షితంగా తిరిగి తీసుకురావడానికి అందుబాటులో ఉన్న ప్రతి అవకాశాన్ని వినియోగిస్తున్నామని స్పష్టం చేశారు. మత్స్యకారుల కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని మంత్రి కోరారు.

# పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ ప్రారంభం






**ఆలమూరు. సిటిజన్ టైమ్స్ ఆగస్టు 25**
అంబేద్కర్ కోనసీమ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో ఆలమూరులో తొలిసారిగా ఏర్పాటు చేసిన పోలీస్ వెల్ఫేర్ పెట్రోల్ బంక్ ను ఐజీ, జి.వి.జి. అశోక్కుమార్, జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ప్రారంభించారు. ఆలమూరులో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్ ప్రారంభోత్సవంలో ఏలూరు ఐజీ జి.వి.జి. అశోక్కుమార్,, జిల్లా ఎస్పీ రాహుల్ మీనా,తో పాటు గా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పాల్గొని పెట్రోల్ బంక్ ప్రారంభించినారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే పెట్రోల్ బంక్లో ఖచ్చితమైన నాణ్యత ప్రమాణాలు ఉంటాయని, ప్రజలు ఈ బంకుల్లో పెట్రోల్ కొట్టించుకొని పోలీస్ శాఖకు సహకరించాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ మహేంద్ర మత్తే ,కొత్తపేట డిఎస్పి సుంకర మురళీమోహన్, కొత్తపేట జనసేన ఇన్చార్జ్ బండారు శ్రీనివాస్, రావులపాలెం రూరల్ సీఐ సిహెచ్ విద్యాసాగర్, ఆలమూరు ఎస్సై జి నరేష్ తదితరులతో కలిసి పాల్గొన్నారు.

# పేదల వైద్యానికి భరోసా.. ఆపదలో అండగా కూటమి ప్రభుత్వం

## దాట్ల సుబ్బరాజు చేతుల మీదగా రూ.88 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**ఐ పోలవరం సిటిజన్ టైమ్స్ ఆగస్టు 25**
శాసనసభ్యుల కార్యాలయంలో నిర్వహించిన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు) చేతుల మీదుగా లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేయడం జరిగింది.

**ఈ సందర్భంగా మండలాల వారీగా లబ్ధిదారులకు అందించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి.**

ముమ్మిడివరం మండలం -- 35 మంది లబ్ధిదారులకు సుమారు రూ.15 లక్షలు. ముమ్మిడివరం నగర పంచాయతి -- 18 మంది లబ్ధిదారులకు రూ.14 లక్షలు. కాట్రేనికోన మండలం --33 మంది లబ్ధిదారులకు రూ. 15.2 లక్షలు, ఐ. పోలవరం మండలం -- 35 మంది లబ్ధిదారులకు రూ.14 లక్షలు తాళ్లరేవు మండలం -- 35 మంది లబ్ధిదారులకు రూ.27 లక్షలు ,మొత్తం 156 మంది లబ్ధిదారులకు రూ.88 లక్షలు విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు మాట్లాడుతూ, ప్రజలకు అత్యవసర వైద్య అవసరాల సమయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగకరంగా నిలుస్తుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రవ్యాప్తంగా సీఎంఆర్ఎఫ్ ద్వారా వేగవంతంగా సహాయం అందిస్తూ ఇప్పటివరకు వేల కోట్ల రూపాయలకు పైగా ఆర్థిక సహాయం పంపిణీ చేయడం జరిగింది. ముమ్మిడివరం నియోజకవర్గంలో ఇప్పటివరకు మొత్తం సుమారు రూ.8 కోట్ల రూపాయలకు పైగా సీఎంఆర్ఎఫ్ సహాయం అర్హులైన బాధిత కుటుంబాలకు అందించడం జరిగిందని తెలిపారు. ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వం అండగా నిలుస్తుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సహాయం చేరేలా నిరంతరం కృషి కొనసాగిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ కోనసీమ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గుత్తుల సాయి మాజీ శాసనసభ్యులు వివేకానంద,4 మండలాల పార్టీల అధ్యక్షులు కూటమి నాయకులు అభిమానులు ప్రజలు మీడియా మిత్రులు పాల్గొన్నారు.

# పురపాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి



**పులివెందుల, సిటిజన్ టైమ్స్, ఆగస్టు 25:**
పులివెందుల పురపాలక అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ తనూజ పేర్కొన్నారు. మంగళవారం కమిషనర్ మున్సిపల్ కార్యాలయం లోని అన్ని శాఖాధిపతులతో ,కార్యాలయ సిబ్బంది తో శాఖల వారీగా సమీక్షా సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది అందరూ సమయ పాలన పాటించాలన్నారు.ఆస్తి పన్ను, నీటి పన్ను,మరియు షాపింగ్ రూముల బాడుగలను నూరు శాతం వసూలుకు రెవెన్యూ సిబ్బంది కృషి చేయాలని సూచించారు.నీటి సరఫరా,వీధి లైట్ల నిర్వహణ మరియు భూగర్భ డ్రైనేజీ నిర్వహణ వంటి విషయాలలో ఇంజనీరింగ్ సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.పట్టణం నందు ఎక్కడే గాని అనధికార కట్టడాలు నిర్మించకుండా ప్లానింగ్ విభాగం చూసుకోవాలన్నారు.ఇంటింటి చెత్త సేకరణ,తడి చెత్త,పొడిచేత్త సేకరణ మరియు పట్టణ పరిశుభ్రత కోసం శానిటేషన్ సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. విధులు యందు నిర్లక్షం వహించిన సిబ్బంది పై శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు.అలాగే త్వరలో జరగబోవు మున్సిపల్ ఎన్నికలకు సిబ్బంది అందరు అందుబాటులో ఉండాలని తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి, మరొకరికి గాయాలు


**భీమిలి సిటిజెన్ టైమ్స్ ఆగష్టు 25:**
భీమిలి పోలీస్ స్టేషన్ పరిధిలోని తల్లవలస, ఒడిశా ప్రధాన్ ధాబా ఎదురుగా ఎన్ హెచ్ -16 రోడ్డుపై సోమవారం రాత్రి సుమారు 19:00 గంటలకు ప్రమాదం జరిగింది. మామిడిపాలెం నుంచి ఆనందపురం వైపు వెళ్తున్న బొచ్చ హరి ప్రసాద్ (29) మరియు అతని స్నేహితుడు తాటిపూడి సురేంద్ర ద్విచక్ర వాహనంలో ప్రయాణిస్తుండగా, తల్లవలస వద్ద వాహనంలో పెట్రోల్ అయిపోవడంతో రోడ్డు పక్కన వాహనాన్ని నిలిపి ఎదురుగా ఉన్న పెట్రోల్ బంక్ వైపు రోడ్డు దాటుతున్నారు. అదే సమయంలో ఆనందపురం నుంచి తగరపువలస వైపు వేగంగా వస్తున్న హీరో గ్లామర్ ద్విచక్ర వాహనం రోడ్డు దాటుతున్న హరి ప్రసాద్ను ఢీకొట్టడంతో అతనికి తలకు, ముఖానికి గాయాలతో పాటు కుడి కాలుకు ఫ్రాక్చర్ అయ్యింది. గాయపడిన హరి ప్రసాద్ను తొలుత ఎన్ఆర్ఐ ఆసుపత్రికి, అనంతరం మెరుగైన చికిత్స కోసం అపోలో ఆసుపత్రి, రామనగర్కు తరలించారు. ప్రమాదానికి కారణమైన ద్విచక్ర వాహనాన్ని బోయి మురళి (35) నడుపుతున్నట్లు గుర్తించగా, ప్రమాదంలో అతనికి కూడా తీవ్ర గాయాలు కావడంతో కేజీహెచ్, విశాఖపట్నంలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం సుమారు 06:00 గంటలకు మృతి చెందాడు. ఈ ఘటనపై భీమిలి పోలీసులు కేసు నమోదు చేసి, ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

# అఖండ గోదారిని ఆరాధించేలా పుష్కరాలు

## భక్తులకు అత్యుత్తమ సౌకర్యాలు, పవిత్రతకు పెద్దపీట -10 కోట్ల మంది పుణ్య స్నానాలు చేస్తారని అంచనా

## 181 కొత్త ఘాట్ల నిర్మాణంతో సహా 440 ఘాట్ల అభివృద్ధి-మొత్తం రూ.4,026 కోట్ల వ్యయంతో 4,932 పనులు

### గోదావరి పుష్కరాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష



**అమరావతి, కాకినాడ సిటిజన్ టై ఆగస్ట్ 25**

ప్రకృతి ఆరాధన-ఆధ్యాత్మిక చింతన మమేకం చేస్తూ గోదావరి పుష్కరాలు నిర్వహించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. ఎక్కడా పవిత్రత దెబ్బతినకుండా, భక్తులకు సమస్యలు తలెత్తకుండా ఇప్పటి నుంచే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వచ్చే ఏడాది జూన్ 26 నుంచి జూలై 7 వరకు 12 రోజుల పాటు పుష్కరాలు అత్యంత వైభవంగా జరపాలని చెప్పారు. పుష్కరాలు కేవలం ప్రభుత్వం నిర్వహించడమే కాదని, స్థానిక ప్రజలను భాగస్వాములను చేయాలన్నారు. పుష్కరాల్లో భాగంగా రూ.4,026 కోట్లతో చేపట్టిన 4,932 పనులకు సంబంధించి పురోగతిపై సచివాలయంలో మంగళవారం ముఖ్యమంత్రి సమీక్షించారు. పుష్కరాలకు ఇంకా 10 నెలల సమయమే ఉన్నందున త్వరితగతిన అన్ని పనులు ప్రారంభించి సకాలంలో పూర్తి చేయాలన్నారు. పనుల నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడొద్దని స్పష్టం చేశారు. అయితే ఈ పనులకు సంబంధించి ఇప్పటికే రూ.899 కోట్లు ఆర్థిక శాఖ కేటాయింపులు జరిగాయని అధికారులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి తెలిపారు. వీటిలో పట్టణాభివృద్ధి, ఆర్ అండ్ బీ, జల వనరులు, విద్యుత్, పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించి అత్యధిక పనులు ఉన్నాయి. ఇందులో తూర్పు గోదావరి జిల్లాలో 1,869, పశ్చిమ గోదావరి జిల్లాలో 625, కోనసీమ జిల్లాలో 1,501, ఏలూరు జిల్లాలో 426, కాకినాడ జిల్లాలో 321, పోలవరం జిల్లాలో 190 పనులు చేపడుతున్నారు. అయితే ఈ పనుల పూర్తికి అవసరమైన నిధుల సమీకరణపై అధికారులు దృష్టి పెట్టాలని, కేంద్ర సాయం కూడా తీసుకోవాలని అధికారులకు సీఎం సూచించారు.



**2027 పుష్కరాలకు భారీగా భక్తులు**

2015 మహా పుష్కరాల్లో ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 4.86 కోట్ల మంది భక్తులు పుణ్య స్నానాలు చేయగా. 2027లో 8 నుంచి 10 కోట్ల మంది గోదావరి పుష్కరాలకు తరలి వస్తారని అంచనా వేస్తున్నట్టు అధికారులు వివరించారు. రోజుకు సుమారు కోటి మంది పుణ్య స్నానాలు చేసే అవకాశం ఉందన్నారు. రద్దీని తట్టుకునేలా మొత్తం 440 ఘాట్లు సిద్ధం చేస్తున్నామన్నారు. వీటిలో ప్రస్తుతం ఉన్న 259 ఘాట్లను అభివృద్ధి చేయడంతో పాటు అదనంగా 181 కొత్త ఘాట్లను నిర్మిస్తున్నామన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో 82 ఘాట్లు, పశ్చిమగోదావరి జిల్లాలో 40 ఘాట్లు, కోనసీమ జిల్లాలో 175 ఘాట్లు, ఏలూరు జిల్లాలో 44 ఘాట్లు, కాకినాడ జిల్లాలో 88 ఘాట్లు, పోలవరం జిల్లాలో 11 ఘాట్లు అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు.

**టెంపుల్ టూరిజంపై ప్రత్యేక దృష్టి**

గోదావరి పరివాహక ప్రాంతంలో ఎన్నో పుణ్యక్షేత్రాలు ఉన్నాయని... పిఠాపురంలో శక్తి పీఠం సహా పంచారామాల్లో 4 క్షేత్రాలు, ఇంకా ద్వారకా తిరుమల, అన్నవరం, వాడపల్లి, అంతర్వేది వంటి ప్రధాన ఆలయాలను కలుపుతూ టూరిజం సర్క్యూట్‌గా అభివృద్ధి చేయాలని సీఎం అధికారులకు సూచించారు. పుష్కరాలకు వచ్చే భక్తులు పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాలను సందర్శించేందుకు వీలుగా హోం స్టేలను ప్రోత్సహించాలని సూచించారు. కొత్తగా హోటళ్ల నిర్మాణం చేపట్టేవారికి త్వరితగతిన అనుమతులు ఇవ్వాలన్నారు. సమీక్షలో ఇంకా ముఖ్యమంత్రి మాట్లాడుతూ 'రాజమహేంద్రవరంలో వివిధ కార్యక్రమాల నిర్వహణ కోసం కన్వెన్షన్ సెంటర్ నిర్మించాలి. దేశ విదేశాల్లో ప్రముఖులు అందరికీ గోదావరి పుష్కరాలకు ఆహ్వానం అందించాలి. రాష్ట్ర విశిష్టత తెలిసేలా, ప్రతిష్ట పెరిగేలా చేసేందుకు ఇదొక అవకాశంగా భావించాలి. కూచిపూడి ఈవెంట్ వంటివి భారీ తరహాలో నిర్వహించేలా దేవా దాయ-పర్యాటక శాఖలు ప్రణాళికలు రూపొందించాలి. పుష్కర ఘాట్లను కలిపే రహదారుల నిర్మాణం సహా, పుష్కరాలు జరిగే 6 జిల్లాలో ఏ రోడ్లపైనా గుంతలు కనిపించకూడదు. పోలవరం ప్రాజెక్టును సందర్శించేలా రహదారుల నిర్మాణం జరగాల్సి ఉంది. బ్రిడ్జిల సామర్థ్యాన్ని పరిశీలించి, దానికి అనుగుణంగా మరమ్మతులు చేయాలి. గోదావరిలో చుక్క కూడా మురుగు నీరు కలవకుండా చూడాలి. అధికారులు ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలి. హేవ్‌లాక్ బ్రిడ్జి, సమీపంలో దీవుల అభివృద్ధి పనులు పూర్తి చేయాలి.' అని నిర్దేశించారు.

**రద్దీ నిర్వహణకు ఏఐ వినియోగం**

ఈసారి పుష్కరాల్లో భద్రత, రద్దీ నిర్వహణకు ఏఐ ఆధారిత క్రౌడ్ అనలిటిక్స్, సీసీటీవీ ఎంట్రీ-ఎగ్జిట్ మానిటరింగ్, డ్రోన్ సర్వైలెన్స్, క్యూఆర్ ఆధారిత వాహన గుర్తింపు, డీసెంట్రలైజ్డ్ డిప్లాయ్‌మెంట్ సిస్టమ్ వంటి సాంకేతికత వినియోగిస్తున్నట్టు అధికారులు తెలిపారు. వైద్య సేవల పరంగానూ ఎటువంటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. అంబులెన్స్‌లు, ఫస్ట్ ఎయిడ్, మెడికల్ క్యాంపులు నిర్వహిస్తామని చెప్పారు. 30 ఫీల్డ్ ఆస్పత్రులను తాత్కాలిక ప్రాతిపదికన ఏర్పాటు చేసి, వాటికి అనుబంధంగా ల్యాబ్‌లు సిద్ధం చేస్తున్నామని తెలిపారు.

**మోడల్ పుష్కర పంచాయతీగా ముని కూడలి**

గోదావరి నదీ పరివాహక జిల్లాల్లోని 260 గ్రామ పంచాయతీలలో 50 గ్రామ పంచాయతీలను మోడల్ పుష్కర పంచాయతీలుగా అభివృద్ధి చేయ తలపెట్టారు. తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలంలోని ముని కూడలిని పైలట్ మోడల్ పుష్కర పంచాయతీగా ఎంపిక చేశారు. కొవ్వూరు--పోలవరం మీదుగా పట్టిసీమ రోడ్డు, సీతానగరం నుంచి సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్ వరకు దీ నాభి బీటీ రోడ్డు, అవెన్యూ ప్లాంటేషన్, బ్యూటిఫికేషన్... సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్ నుంచి కొవ్వూరు వరకు రోడ్లు అభివృద్ధి చేయనున్నారు. రాజమహేంద్రవరం--పోలవరం మధ్య జాతీయ రహదారి అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. పుష్కరాలు కాలుష్య రహితంగా చేసేందుకు 487 గ్రీన్ ఎనర్జీ బస్సులు వినియోగించనున్నారు.11 బస్‌స్టేషన్లను ఆధునీకరిస్తున్నారు. నదిలో భక్తుల భద్రతకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నారు. 2,697 రెస్క్యూ బోట్లు సిద్ధం చేయడంతో పాటు, 8,955 శిక్షణ పొందిన ఈతగాళ్లను పుష్కరాల సమయంలో నియమించనున్నారు.

**అఖండ గోదావరికి పుష్కర ఏర్పాట్లు**

గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించడంతో పాటు, దేశ, విదేశాల నుంచి వచ్చే భక్తులు, పర్యాటకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రపంచస్థాయి మౌలిక వసతులు, రవాణా, పారిశుద్ధ్యం, తాగునీరు, వైద్య సేవలు, భద్రత, వసతి, సాంకేతిక పరిజ్ఞానంతో సమగ్ర ఏర్పాట్లను అద్భుతంగా చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టం చేశారు. గోదావరి జన్మస్థానం నుంచి సముద్ర సంగమం వరకు అనేక ఉప నదులు, వాగులు, ఏరులు కలుస్తున్నందున 'అఖండ గోదావరి' పేరుతో పుష్కరాలు నిర్వహించే అంశాన్ని పరిశీలించాలని సీఎం సూచించారు. ఈ సమీక్షలో మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, బీసీ జనార్ధన్ రెడ్డి, వై.సత్యకుమార్ యాదవ్, గోదావరి పుష్కరాల ప్రత్యేకాధికారి, పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# క్యూఆర్ కోడ్ స్కానర్ ద్వారా స్పందన తెలియ జేయండి ..

### జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్




**కాకినాడ, సిటిజన్ టైమ్స్ ఆగస్టు 25**

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్)పై ప్రజలు తమ స్పందన తెలియజేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను మరింత పార దర్శకత,జవాబుదారీతనం దిశగాను, నిరంతరఅభిప్రాయ సేకరణ చేసి పౌరుల సంతృప్తిని మెరుగు పరచడం,వ్యవస్థ ను బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతోఉందన్నారు. పి.జి.ఆర్.ఎస్ కేంద్రాలను సందర్శించే పౌరుల నుండి అభిప్రాయాన్నిసేకరించేందుకు జిల్లా, మండల స్థాయి పి.జి.ఆర్.ఎస్ కేంద్రాలలో,వివిధ మాధ్యమాల్లో ప్రజల అభిప్రాయ సేకరణకు క్యూఆర్ కోడ్‌ను ప్రదర్శించాలనినిర్ణయించడం జరిగిందనన్నారు. జిల్లా,మండల స్థాయి పి.జి.ఆర్.ఎస్ కేంద్రాల ప్రవేశ,నిష్క్రమణ ప్రాంతాలలో క్యూ.ఆర్ కోడ్ ప్రముఖంగా ప్రదర్శించాలని ఆదేశించారు. పౌరులు పి.జి.ఆర్.ఎస్ సేవలను పొందిన వెంటనే తమ మొబైల్ ఫోన్‌ల ద్వారా క్యూ.ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ అభిప్రాయాన్ని సమర్పించవచ్చునన్నారు. క్యూ.ఆర్ కోడ్ వలన ప్రజల స్పందన అధికారిక పి.జి.ఆర్.ఎస్ పోర్టల్ కు చేరుతుందని అన్నారు. లిపి.జి.ఆర్.ఎస్ ను వినియోగించుకోవాలని, తమ అభిప్రాయాలను తెలియజేస్తూ మరింత మెరుగైన సేవలు అందించుటకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతీ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోను, మండలకార్యాలయాల్లోనూ నిర్వహించే పి.జి.ఆర్.ఎస్ లో అర్జీలు అందించండి, వాటిపై మీ స్పందన క్యూ.ఆర్ కోడ్ ద్వారా తెలియజేయండి అని కోరారు.

# మద్యానికి బలి అయి మృతి చెందిన యువకుడు

### మాజీ ప్రభుత్వ సలహాదారు నాగార్జున రెడ్డి ఆవేదన



**బద్వేలు, సిటిజన్ టైమ్స్; ఆగస్టు 25**

రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతుందని యువత మద్యానికి బానిసలై ప్రాణాలు పోల్పడుతున్నారని మాజీ ప్రభుత్వ సలహాదారు నాగార్జున్ రెడ్డి అన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతున్నదని బ్రాందీ షాపుల్లోనే కాకుండా బెల్ట్ షాపుల ద్వారా ప్రతి పట్టణంలోనూ. ప్రతి గ్రామంలోనూ. హోటలలోను. కూలింగ్ షాపు. ధాబాల్లోనూ. ఈ విపరీతంగా.అమ్ముతున్నారని. ఇప్పుడు యువత ఎక్కువమంది మద్యానికి బానిసలై. అకృత్యాలకు పా పాల్పడుతూ . డబ్బుల కోసం ఏ పనైనా చేయడం జరుగుతుందని. పదో తరగతి చదివే విద్యార్థులు స్కూల్ ప్రిన్సిపాల్ ను కత్తులతో పొడిచి చంపడం జరిగిందని. తల్లిదండ్రులు డబ్బులు ఇవ్వలేదని తండ్రిని కూడా చంపడం. భార్యాబిడ్డలను హింసించడం. ఇలా ప్రతినిత్యం రాష్ట్రంలో జరుగుతున్నాయని.చిన్న వయసులోనే ప్రాణాలను పోగొట్టుకుంటున్నారని. రాష్ట్రంలో రోజు వందలాదిమంది మద్యానికి అలవాటు పడి చనిపోతున్నారని..ఆరోగ్యం చిన్న వయసులోనే .లివరు కిడ్నీ చెడిపోయి అనారోగ్యానికి గురి అవుతున్నారు.. తాగి వాహనాలు మోటార్ బైకులు నడిపి వందలాదిమంది యువకులు చనిపోవడం జరుగుతున్నదని. ఈరోజు నాయబ్ అనే యువకుడు మద్యానికి బానిసై 26 ఏళ్ల వయసులోనే చనిపోవడం జరిగిందని. ఇలా చాలామంది. రాష్ట్రవ్యాప్తంగా చనిపోవడం జరుగుతున్నదని. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత రాష్ట్రంలో తాగుబోతుల సంఖ్య విపరీతంగా పెరిగిందని. ఇలాగే కొనసాగితే రాష్ట్రంలో సగభాగం మంది తాగుబోతులు గా మారే ప్రమాదం ఉందని ప్రభుత్వం ఎన్ని పథకాలు ఇచ్చిన ప్రయోజనం లేదని ఇప్పటికైనా గతంలో మాదిరిగా మహిళలు ఉద్యమించాలని బెల్టు షాపులు లేకుండా పోరాటం చేయాలని తమ కుటుంబాలను .తమ పిల్లలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని. అన్నారు ఇప్పుడు మద్యానికి. బ గ్యాకు. డ్రగ్స్ కు. అలవాటు పడిన వాళ్లను చూస్తే. రిహాబిటేషన్ సెంటర్లు. రాష్ట్రంలో ఎక్కువగా ఉన్నాయని. అయినా వాళ్లు మళ్లీ ఇంటికి వచ్చి తర్వాత అలవాటు పడుతున్నారని ప్రాణాలను పోగొట్టుకుంటున్నారని నాగార్జున్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

# పి.గన్నవరం నియోజకవర్గంలో రూ.17.67 కోట్లతో 16 రోడ్ల అభివృద్ధి

**మామిడి కుదురు సిటిజన్ టైమ్స్ ఆగస్టు 25**

అంబేద్కర్ కోనసీమ జిల్లా, మామిడికుదురు మండలం అప్పన్నపల్లి గ్రామంలోని ఉచ్చులవారిపేటలో 2.36 కిలోమీటర్ల సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.1.45 కోట్ల వ్యయంతో, పి.గన్నవరం మండలం మానేపల్లి గ్రామానికి సంబంధించి శివాయలంకలో 1.60 కిలోమీటర్ల సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.1.37 కోట్ల వ్యయంతో, పి.గన్నవరం మండలం నాగులంక గ్రామంలోని నామాడివారిపేటలో 1.20 కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.40 లక్షల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు పి.గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ, పి.గన్నవరం నియోజకవర్గంలో ఏపీఆర్ఆర్ఎస్‌పీ పథకం కింద 16 రోడ్లు మంజూరు కాగా, మొత్తం రూ.17.67 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఇటీవల టెండర్ల ప్రక్రియ పూర్తికావడంతో, మంజూరైన రోడ్ల నిర్మాణ పనులకు దశలవారీగా శంకుస్థాపనలు చేస్తున్నామని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నర సంవత్సరాల వ్యవధిలోనే పి.గన్నవరం నియోజకవర్గంలో సుమారు 80 శాతం రోడ్లను పూర్తి చేయడం జరిగిందని, మిగిలిన రోడ్లను కూడా త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించే దిశగా చర్యలు తీసుకుంటామని, డ్రైనేజీ వ్యవస్థను కూడా త్వరలోనే పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేలా కృషి చేస్తానని తెలిపారు. పి.గన్నవరం నియోజకవర్గం అభివృద్ధి పథంలో ముందుకు సాగేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అందిస్తున్న సహకారం ఎంతో కీలకమని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తున్న ముఖ్యమంత్రి,ఉప ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




# గోదావరి పుష్కర ఘాట్ల పనులు వేగవంతం చేయాలి

### జిల్లా జాయింట్ కలెక్టర్ వై. ఖోమ్. నైడియా దేవి

**అమలాపురం సిటిజన్ టైమ్స్ 25**

గోదావరి పుష్కరాల సన్నద్ధతపై పుష్కర ఘాట్ల నిర్వహణ పనులు వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ వై.ఖోమ్. నైడియా దేవి తెలిపారు. మంగళవారం రాష్ట్ర సచివాలయం నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి జూమ్ మీటింగ్ ద్వారా అన్ని జిల్లాల జిల్లా కలెక్టర్లు జాయింట్ కలెక్టర్లతో గోదావరి పుష్కరాల ఘాట్ల అభివృద్ధి, ఆధ్యాత్మిక దేవాలయాల నిర్వహణ, పర్యాటకం, మౌలిక వసతుల కల్పనపై సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జూమ్ మీటింగ్ అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ రానున్న గోదావరి పుష్కరాలు - 2027 అఖండ గోదావరి పరివాహక ప్రాంతాలైన వాడపల్లి,అంతర్వేది, కోటిపల్లి, అప్పనపల్లి, కుండలేశ్వరం గోదావరి తీరంలో ఆధ్యాత్మికత, దైవభక్తి, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలను దృష్టిలో ఉంచుకొని గోదావరి విశిష్టత పెంపొందించే విధంగా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని ఆమె తెలిపారు.



గోదావరి పుష్కర ఘాట్ల నిర్వహణ పనులపై దృష్టి సారించి శాఖల సమన్వయంతో పనులు వేగవంతం చేయాలని అధికారులు ఆదేశించారు. పోలీస్, దేవాదాయ, పర్యాటకం ఇరిగేషన్,పంచాయతీ శాఖల సమన్వయంతో నిర్దిష్టమైన ప్రణాళికలు ఏర్పాటు చేసుకుని గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించాలని ఆమె తెలిపారు. గోదావరి పుష్కరాల సమయంలో భక్తులు రద్దీ నియంత్రణ పై దృష్టి సారించి, బస్సులు రాకపోకలు విషయంలో ఎటువంటి అంతరాయం కలగకుండా తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె తెలిపారు. గోదావరి పుష్కరాలు సమయంలో భక్తులు తాకిడి మరింత పెరిగే అవకాశం ఉన్నందున తాత్కాలిక గృహాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు డివిజన్ మండల స్థాయి అధికారులు రెవెన్యూ, దేవాదాయ, ఇరిగేషన్ పంచాయతీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఆసరా పెన్షన్ దరఖాస్తులకు ఈ నెల 31 చివరి గడువు

### అర్హులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలి:

### మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి




**సిటిజన్ టైమ్స్ నాగర్ కర్నూల్ ఆగస్టు25**

నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలో ఆసరా పెన్షన్ దరఖాస్తులకు ఈ నెల 31వ తేదీతో గడువు ముగియనుందని మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి తెలిపారు. ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులు, కల్లుగీత కార్మికులు, చేనేత కార్మికులు, ఫైలేరియా బాధితులు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని అర్హులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నప్పటికీ వివరాలు సక్రమంగా ఇవ్వని వారు కూడా సరిచేసుకుని పత్రాలు సమర్పించాలని తెలిపారు. నాగర్‌కర్నూల్ మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తులు, సంబంధిత పత్రాలు సమర్పించాలని సూచించారు. దరఖాస్తుతో పాటు ఫోటో, ఆధార్ కార్డు, రేషన్ కార్డు లేదా ఆదాయ ధ్రువీకరణ పత్రం, ప్రభుత్వ రంగ బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్ కాపీలు జత చేయాలని తెలిపారు. అర్హులైన ఒంటరి మహిళలకు అవసరమైన ధ్రువీకరణ పత్రం మున్సిపల్ కార్యాలయంలో అందుబాటులో ఉంటుందని అధికారులు తెలిపారు. గడువు ముగిసేలోపు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ అధికారులు కోరారు.

# తాటి వనం... తీరానికి రక్షణ కవచం

### గ్రేట్ గ్రీన్ వాల్ రెండో అంచెలో తుపాను గాలి నిరోధక వ్యవస్థగా తాటి చెట్లు -తాటి గింజల సేకరణ, నాటే ప్రక్రియ ప్రారంభం

### 5,499 హెక్టార్ల విస్తీర్ణంలో 55 లక్షల తాటి గింజలు నాటడం లక్ష్యం -సీజన్ ప్రారంభంలోనే 13 లక్షల తాటి గింజలు సేకరించిన అటవీ శాఖ

### తాటి వనాల ఏర్పాటు ప్రక్రియలో ప్రజలంతా భాగస్వాములు కావాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిలుపు

**కాకినాడ సిటిజన్ టైమ్స్ ఆగస్టు 25**

సుదీర్ఘ తీర ప్రాంతానికి సహజ రక్షణ కవచం ఏర్పాటు దిశగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ తీసుకున్న గ్రేట్ గ్రీన్ వాల్ సంకల్పంలో కీలకమైన తాటి వనాల ఏర్పాటు ప్రక్రియ మొదలయ్యింది. తాటి కాయల సీజన్ ప్రారంభం కావడంతో తాటి గింజల సేకరణ, నాటే కార్యక్రమానికి రాష్ట్ర అటవీ శాఖ శ్రీకారం చుట్టింది. గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో ప్రకృతి విపత్తుల సమయంలో గాలి నిరోధక వ్యవస్థగా తాటి వనాలు తీర ప్రాంత గ్రామాలకు తీవ్ర గాలుల నుంచి రక్షణ కల్పించనున్నాయి. మూడంచెల గ్రేట్ గ్రీన్ వాల్ ఏర్పాటు ప్రక్రియలో తాటి వనాల ఏర్పాటుకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఉప్పు నీరు, హోరు గాలులతో ఉండే తీర ప్రాంతాల కఠిన వాతావరణ పరిస్థితులకు తాటి చెట్టు అత్యంత అనుకూలమైన వృక్ష జాతి, ఉప్పు నేలలు, ఇసుక, బుసకతో కూడిన తీర ప్రాంత ఒండ్రు నేలల్లో సైతం పెరిగే సామర్థ్యం తాటి చెట్టుకు ఉంది. ఎత్తుగా పెరిగే జాతి కావడంతో బలమైన సముద్ర గాలులకు సహజ నిరోధక వ్యవస్థగా పని చేస్తుంది. అంతే కాదు బలమైన తాటి వేర్లు నేలను గట్టిగా పట్టి ఉండడం వల్ల తీర ప్రాంతాల్లో కోత నిరోధక వ్యవస్థగా కూడా ఉంటుంది. పక్షులు, కొన్ని రకాల సరిసృపాలకు ఆవాసంగా ఉండే తాటి చెట్లు జీవ వైవిధ్యానికి ప్రతీకగా ఉంటాయి. వాతావరణ మార్పుల ప్రభావాన్ని కూడా తట్టుకోగల శక్తి



తాటి చెట్టు సొంతం. అందుకే పవన్ కళ్యాణ్ రూపొందించిన మూడంచెల గ్రేట్ గ్రీన్ వాల్ ప్రణాళికల్లో మొదటి అంచె మడ అడవులకు, రెండో అంచె తాటి వనాలకు ప్రాధాన్యత ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా తీర ప్రాంతం వెంబడి 5,499 హెక్టార్ల పరిధిలో తాటి వనాల ఏర్పాటును లక్ష్యంగా ఉప ముఖ్యమంత్రి ప్రతిపాదించారు. అందుకు దాదాపు 55 లక్షల తాటి గింజలు అవసరం అవుతాయని అటవీ శాఖ భావిస్తోంది. ఈ ఏడాది తాటి కాయల సీజన్ మొదలైన నాటి నుంచి ఇప్పటి వరకు గ్రామీణ ప్రజలు, వివిధ వ్యవస్థల భాగస్వామ్యంతో 13 లక్షల తాటి గింజలు సేకరించారు. ఇప్పటికే 1 లక్ష 65 వేల తాటి గింజలను పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖలు, స్కూలు విద్యార్థులు, ప్రజల భాగస్వామ్యంతో నాటే ప్రక్రియను రాష్ట్ర అటవీ శాఖ ఆధ్వర్యంలో పూర్తిచేశారు. ఈ సీజన్‌లోపవన్ కళ్యాణ్ నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలన్న బలమైన సంకల్పంతో ముందుకు వెళ్తున్నట్టు ఆ శాఖ అధికారులు స్పష్టం చేశారు. తాటి గింజల సేకరణ, నాటడం, తాటి మొక్కల పెంపకం వంటి అంశాల్లో రాష్ట్ర అటవీ శాఖకు ప్రజలంతా సహకరించాలని ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. మొలకెత్తే తాటి మొక్కల స్వీయ సంరక్షణ చర్యలు చేపట్టాలని, మొలకెత్తిన మొక్కల పైకి పశువులను తోలడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. విలువైన సహజ సంపదను కాపాడుకునే చర్యల్లో అటవీ శాఖ క్షేత్ర స్థాయి సిబ్బందికి సహకరించాలని కోరారు. స్థానిక ప్రజలు, విద్యా సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పవన్ కళ్యాణ్ విజ్ఞప్తి చేశారు. తీర ప్రాంతాల వెంబడి అనుకూల ప్రదేశాల్లో శాస్త్రీయ పద్ధతిలో తాటి గింజల నాటాలని పేర్కొన్నారు. గ్రేట్ గ్రీన్ వాల్‌తోపాటు 50 శాతం గ్రీన్ కవర్, పర్యావరణ పునరుద్ధరణ, రాష్ట్రంలో సహజ వనరుల పరిరక్షణ చర్యల్లో ప్రతి ఒక్కరినీ భాగస్వామ్యం చేయాలని అన్నారు. భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించే ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## కార్యకర్తల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

### ప్రమాదంలో మృతి చెందిన టీడీపీ కార్యకర్త కుటుంబానికి రూ.5 లక్షల ప్రమాద బీమా

### మంత్రి వాసంశెట్టి సుభాష్



**రామచంద్రపురం సిటిజన్ టైమ్స్ ఆగస్టు 25**

తెలుగుదేశం పార్టీలో ఉన్న ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందిన టీడీపీ కార్యకర్త కుటుంబానికి రూ.5 లక్షల ప్రమాద బీమా చెక్కును మంత్రి సుభాష్ అందజేశారు. రామచంద్రపురం మండలం కందులపాలెం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త వినకోటి స్టాలిన్ ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందారు. ఈ నేపథ్యంలో టీడీపీ సభ్యత్వం ద్వారా లభించే ప్రమాద బీమా కింద మంజూరైన రూ.5 లక్షల చెక్కును స్టాలిన్ భార్య అనూషకు మంగళవారం మంత్రి సుభాష్ తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ.. టీడీపీ సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలు ప్రమాదవశాత్తు మృతి చెందితే వారి కుటుంబాలను ఆదుకునేందుకు పార్టీ రూ.5 లక్షల ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పిస్తోందన్నారు. దేశంలో ఏ రాజకీయ పార్టీ చేయని విధంగా కార్యకర్తల సంక్షేమానికి టీడీపీ ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. కార్యకర్త కష్టాల్లో ఉంటే పార్టీ కుటుంబంలా అండగా నిలుస్తుందని మంత్రి పేర్కొన్నారు. కోటి మందికి పైగా సభ్యులతో బలమైన కుటుంబంగా ఉన్న తెలుగుదేశం పార్టీ, కార్యకర్తలకు కష్టకాలంలో భరోసాగా నిలుస్తోందన్నారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ కార్యకర్తల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రమాద బీమా కార్యక్రమాన్ని అమలు చేయడం అభినందనీయమన్నారు.ప్రమాద బీమా ద్వారా స్టాలిన్ కుటుంబానికి కొంతమేర ఆర్థిక భరోసా లభిస్తుందని మంత్రి సుభాష్ అన్నారు. కార్యకర్తల సంక్షేమం, వారి కుటుంబాల భద్రత కోసం టీడీపీ ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, టీడీపీ మహిళా నాయకురాలు వయిట్ల గజలక్ష్మి, పలివెల ప్రకాష్ తదితరులుపాల్గొన్నారు.

## కోనసీమ రైల్వే ప్రాజెక్టుకు భూసేకరణ వేగవంతం చేయాలి

### కోనసీమ జేఏసీ



**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఆగస్టు 25**

కోనసీమ రైల్వే ప్రాజెక్టు పూర్తికి అవసరమైన భూసేకరణ పనులను రాష్ట్ర ప్రభుత్వం వేగవంతం చేసి, రైల్వే శాఖకు అప్పగించాలని కోనసీమ జేఏసీ డిమాండ్ చేసింది. ప్రాజెక్టుకు సంబంధించి సుమారు 57 కిలోమీటర్ల మేర భూసేకరణ పూర్తి చేయాల్సి ఉండగా, ప్రస్తుతం ఈ ప్రక్రియ నత్తనడకన సాగుతోందని జేఏసీ పేర్కొంది. ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ పూర్తి చేసి రైల్వే శాఖకు అప్పగించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని జేఏసీ కన్వీనర్ బండారు రామమోహన్ రావు తెలిపారు. ఇదే విషయాన్ని సౌత్ కోస్ట్ రైల్వే అధికారులు కూడా ధ్రువీకరించారని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే సుమారు 20 కిలోమీటర్ల మేర భూసేకరణ పూర్తయిందని, మిగిలిన 37 కిలోమీటర్ల భూసేకరణను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. కోనసీమ ప్రజల చిరకాల స్వప్నమైన రైల్వే ప్రాజెక్టు పనులు ముందుకు సాగేందుకు ప్రజాప్రతినిధులు, సంబంధిత ప్రభుత్వ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని జేఏసీ కార్యవర్గం డిమాండ్ చేసింది. త్వరలో జరగనున్న కోనసీమ ప్రజాప్రతినిధుల సమావేశంలో భూసేకరణ అంశంపై తప్పనిసరిగా చర్చించి, ప్రాజెక్టు పురోగతికి అవసరమైన చర్యలు చేపడతారనే ఆశాభావాన్ని జేఏసీ వ్యక్తం చేసింది.

## మత్స్యకార కుటుంబాలకు నిత్యవసరాల పంపిణీ

**అల్లవరం సిటిజన్ టైమ్స్ ఆగస్టు 25**

మండలంలోని ఓడలరేవు లో ఇటీవల సముద్రంలో వేటకు వెళ్లి ఆచూకీ దొరక్క ఇబ్బంది పడుతున్న ఓడలరేవు,బెండమూర్లంక, రామేశ్వరం గ్రామాలకు చెందిన మత్స్యకార కుటుంబాలను పలకరించి ధైర్యం చెప్పి జనసేన పార్టీ తరుపున 5 కుటుంబాలకు నిత్యావసరాలు, కిరాణా అందచేసారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కల్వకొలను తాతాజీ, ఇసుకపట్ల రఘుబాబు, కామాడి గంగాభవాని, కంకిపాటి వీరబాబు, కటికిరెడ్డి బాబీ,ఆకుల సూర్యనారాయణ మూర్తి, చిక్కం సుధా సూర్యమోహన్, తాడి కమలనాబ్, ఉండ్రు సుధాకర్, పిండి గణపయ్య, వర్రె సూరిబాబు,గోళ్ళ కమల, నూకల రాజా, కుంపట్ల రమేష్, యర్రంశెట్టి నాగేశ్వరరావు, పోచనపెద్ది వెంకటేష్ తదితర జనసైనికులు పాల్గొన్నారు.



# బిసిల ఆరాధ్య దైవం బిపి. మండల్

### బద్వేలులో ఘనంగా బి.పి. మండల్ 108వ జయంతి వేడుక



**బద్వేలు, సిటిజన్ టైమ్స్; ఆగష్టు 25;**

బీసీల ఆరాధ్య దైవం బీపీ మండల్ 18వ జయంతి వేడుకలనుమంగళవారము ఉపాధ్యాయులు బద్వేలు పట్టణంలోని స్థానిక ఆర్టీసీ ప్రాంగణంలోని మజ్దూర్ యూనియన్ కార్యాలయంలో "మండల్ ఆశయసాధన సమితి" రాష్ట్ర అధ్యక్షులు : కావేటి రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో ఘణంగా నిర్వహించారు.మొదటగా మాన్యశ్రీ బిందేశ్వరీ ప్రసాద్ మండల్ చిత్రపటానికి పుష్పమాల, వివిధ రకాలపుష్పాలతో నివాళులర్పించారు. కార్యక్రమం లో "మహనీయుల ఆశయసాధనసమితి వ్యవస్థాపకులు, మరియు జాతీయ బిసి సంక్షేమసంఘం రాష్ట్రప్రచారకార్యధర్శి బద్వేలు గురుమూర్తి, నాయిబ్రాహ్మణకార్పోరేషన్ డైరెక్టర్ కొలవలి. వేణుగోపాల్ నాయి అతిధులుగా పాల్గొన్నారు. ఈసందర్భంగా బి. గురు మూర్తి మాట్లాడుతూ "వెనుకబడిన వర్గాల నుంచి ఒక చదువుకున్న వ్యక్తి, తాను వచ్చిన సమాజం అభివృద్ధి కోసం నిస్వార్థంగా, నిబద్ధతతో పనిచేస్తే ఎలాంటి మార్పు సాధ్యమవుతుందో చూపించిన గొప్ప ఉదాహరణ --- బీ.పీ. మండల్ జీవితం." అన్నారు. బిసిలకు రానున్న ఎన్నికలలో అధిక శాతం సీట్లిచ్చి పంచాయతీ, మున్సిపల్, కార్పోరేషన్ చైర్మెన్ లు గా మరియు అధిక శాతం వున్న బిసిలు 139కులాలలోని వారు చట్టసభలలో ప్రాతినిధ్యం వహించినపుడే బి.పి మండల్,పూలే, అంబేద్కర్ గార్ల ఆశయాలు నెరవేరుతాయి అన్నారు. ఎ.పి నాయిబ్రాహ్మణకార్పోరేషన్ డైరెక్టర్ కొలవలి.వేణుగోపాల్ మాట్లాడుతూ రాష్ట్ర దేశ వ్యాప్తంగా నేడు బీ.పీ. మండల్ జయంతి సందర్భంగా ఆయన జీవితాన్ని, సామాజిక నిబద్ధతను, వెనుకబడిన వర్గాల హక్కుల కోసం ఆయన చేసిన కృషిని స్మరించుకోవడం ఎంతో అవసరం. పదవులతోబాటుగా, ఆర్థిక, సామాజిక అధికార స్వావలంబన సాధించడమే బిపి మండల్ గారికి నిజమైన నివాళి అన్నారు.మండల్ ఆశయసాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు కావేటి. రమేష్ యాదవ్ మాట్లాడుతూ బీ.పీ. మండల్ --- బాల్యం, విద్యాభ్యాసం, ఉద్యోగ, రాజకీయపదవులు, సేవ తదితరఅంశాలు క్షుణ్ణంగా వివరించారు. బీ.పీ. మండల్ (బిందేశ్వరి ప్రసాద్ మండల్) 1918 ఆగస్టు 25న బీహార్‌లోని బనారస్‌లో ఒక సంపన్న జమీందారీ యాదవ కుటుంబంలో జన్మించి మాధేపురా జిల్లాలోని మోరో గ్రామంలో పెరిగారు. మాధేపురాలో ప్రాథమిక విద్య, దర్భంగాలో ఉన్నత పాఠశాల విద్య, పాట్నా కాలేజీలో ఇంటర్మీడియట్ పై చదువులుకలకత్తాలోని ప్రెసిడెన్సీ కళాశాలలో చేరారు. విద్యాభ్యాసం మధ్యలో ఆగిపోయినా, ఆయనలోని సామాజిక స్పృహ, ప్రజల పట్ల బాధ్యత, న్యాయం కోసం పోరాడే తత్వం మాత్రం ఆగిపోలేదు.

**23 ఏళ్లకే ప్రజాజీవితంలోకి...**

బీ.పీ. మండల్ తన 23వ ఏటనే జిల్లా కౌన్సిల్‌కు ఎన్నికయ్యారు. 1945--1951 మధ్యకాలంలో మాధేపురా డివిజన్‌లో జీతం తీసుకోకుండా" జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌గా" పనిచేశారు. 1952లో మొదటిసారిగా శాసనసభకు ఎన్నికయ్యారు పదవి కంటే మనస్సాక్షికే ప్రాధాన్యత యిచ్చారు.ఎస్ఎస్పీ రాష్ట్ర పార్లమెంటరీ బోర్డు ఛైర్మన్‌గా నియమితులయ్యారు.

**1967 --- రాజకీయ ప్రస్థానంలో కీలక మలుపు**

1967 ఎన్నికల్లో ఎస్ఎస్పీ అభ్యర్థుల ఎంపికలో మండల్ చేసిన కృషి, ఆయన నిర్వహించిన ప్రచారం ఆ పార్టీకి ఎంతో ఉపయోగపడింది మండల్ పార్లమెంట్ సభ్యుడిగా ఉన్నప్పటికీ రాష్ట్ర కేబినెట్‌లోకి తీసుకున్నారు. ఆయన ఆరోగ్యశాఖ మంత్రిగా పనిచేశారు. 1968 ఫిబ్రవరి 1న బీ.పీ. మండల్ బీహార్ రెండో బీసీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అవినీతిపై రాజీ లని పోరాటం చేశారు.ప్రభుత్వ నిర్ణయాల్లో కులతత్వానికి తావుండకూడదన్నారు.సోషిత్ దళ్ ఏర్పాటు 1967 మార్చి 5న సోషిత్ దళ్ (అణగారిన ప్రజల పార్టీ)ను స్థాపించారు. 1972లో తిరిగి శాసనసభకు ఎన్నికయ్యారు. 1979 జనవరి 1న జనతా ప్రభుత్వం ఏర్పాటు చేసిన రెండో వెనుకబడిన తరగతుల కమిషన్‌కు బీ.పీ. మండల్ ఛైర్మెన్ అయ్యారు. 1990 ఆగస్టు 7న పార్లమెంట్‌లో మండల్ కమిషన్ సూచించిన 40 సిఫార్సుల్లో ఒకటైన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో బీసీలకు 27 శాతం రిజర్వేషన్ కల్పించే నిర్ణయాన్ని వీ.పీ. సింగ్ ప్రభుత్వం ప్రకటించింది. కార్రక్రమంలో బీసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షులు గంటా వెంకటయ్య, అబ్దుల్ కలాం ఫౌండేషన్ అధ్యక్షులు ఎస్.ఎ సత్తార్ , ఆవాస్ రాష్ట్ర కమిటీ సభ్యులు అన్వర్ భాష, సంఘమిత్ర స్వచ్ఛంద సేవ సంస్థ చైర్మన్ సొద్దల సిపిఎం పార్టీ నాయకులు మస్తానయ్య,పార్టీ బద్వేలు నియోజకవర్గ యూత్ కన్వీనర్ నరేంద్ర,ఆవాజ్ కమిటీ సబ్యులు రసూల్ తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గంలో 80 శాతం రోడ్ల నిర్మాణాలు పూర్తి

### ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ



అంబేద్కర్ కోనసీమ జిల్లా, పి.గన్నవరం మండలం పి.గన్నవరం గ్రామంలో పి.గన్నవరం శివాలయం రోడ్డు నుంచి పోతవరం గ్రామపంచాయతీ వరకు 3.96 కిలోమీటర్ల సీసీ, బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.2.60 కోట్ల వ్యయంతో, పి.గన్నవరం మండలం కుందాలపల్లి గ్రామంలో 2.60 కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.1.95 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు పి.గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ, పి.గన్నవరం నియోజకవర్గంలో ఏపీఆర్ఆర్ఎస్పీ పథకం కింద 16 రోడ్లు మంజూరు కాగా, మొత్తం రూ.17.67 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఇటీవల టెండర్ల ప్రక్రియ పూర్తికావడంతో మంజూరైన 16 రోడ్లకు దశలవారీగా శంకుస్థాపనలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నర సంవత్సరాల వ్యవధిలోనే పి.గన్నవరం నియోజకవర్గంలో సుమారు 80 శాతం రోడ్ల నిర్మాణ పనులు పూర్తి చేయడం జరిగిందని, మిగిలిన రోడ్లను కూడా త్వరితగతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని డ్రైనేజీ వ్యవస్థను కూడా త్వరలోనే అభివృద్ధి చేసి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కుందాలపల్లి గ్రామానికి చెందిన సుమారు 500 మంది రైతులు గత 30 సంవత్సరాలుగా రహదారి సౌకర్యం కోసం ఎదురుచూస్తున్నామని తెలిపారు. తమ సమస్యలను ఇప్పటివరకు ఏ శాసనసభ్యుడు పరిష్కరించలేదని, ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయ తమ కష్టాలను అర్థం చేసుకుని కుందాలపల్లి బీటీ రోడ్డును మంజూరు చేయించినందుకు జీవితాంతం ఆయనకు రుణపడి ఉంటామని రైతులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రైతులు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కి కృతజ్ఞతలు తెలుపుతూ పాలాభిషేకం నిర్వహించారు. ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న రహదారి సమస్యకు పరిష్కారం లభించడంతో రైతులు, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. పి.గన్నవరం శివాలయం రోడ్డు నుంచి పోతవరం గ్రామపంచాయతీ వరకు నిర్మించనున్న 3.96 కిలోమీటర్ల రహదారి పనులను తానే దగ్గరుండి పర్యవేక్షించి, నాణ్యతా ప్రమాణాలతో పనులు జరిగేలా చూస్తానని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపారు. ప్రజలకు దీర్ఘకాలికంగా ఉపయోగపడే విధంగా రోడ్డు నిర్మాణం ఉండేలా అధికారులు, కాంట్రాక్టర్లతో సమన్వయం చేసుకుంటామని చెప్పారు. పి.గన్నవరం నియోజకవర్గం అభివృద్ధి పథంలో ముందుకు సాగేందుకు ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అందిస్తున్న సహకారం ఎంతో ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తున్న ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు..

## జనంలోకి జనసేన ఇంటింటికి జనసేన



**రామచంద్రాపురం సిటిజన్ టైమ్స్ జనవరి 25**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదల పవన్ కళ్యాణ్ ఆదేశం ప్రకారం రామచంద్రపురం నియోజకవర్గ పార్టీ ఇంచార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమం లో భాగంగా మంగళవారం వై ఎస్ ఆర్ నగర్ 5 వ వార్డు లో జనసైనికులు , వీర మహిళలు స్థానిక ఎన్నికల దృష్ట్యా పార్టీ ప్రచార కార్యక్రమం .ఈ ప్రచార కార్యక్రమంలో జనసేన నాయకులు, వీర మహిళలు, కార్యకర్తలు, అభిమానులు ప్రజల సమస్యలు తెలుసుకుంటూ , కార్యక్రమాన్ని జయప్రదం చేయడం జరిగిందని ఒక ప్రకటన ఒక ప్రకటనలో తెలిపారు.

## నూతన సబ్ - డివిజనల్ పోలీస్ కార్యాలయం ప్రారంభం

### ముఖ్య అతిథులుగా ఐజీ ,జి.వి.జి.అశోక్‌కుమార్, జిల్లా ఎస్పీ రాహుల్ మీనా



**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఆగస్ట్ 25**

అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన సబ్ - డివిజనల్ పోలీస్ కార్యాలయాన్ని మంగళవారం ఏలూరు రేంజ్ ఐజీ జి.వి.జి. అశోక్‌కుమార్, ప్రారంభించారు. ముందుగా ఐజీ కి వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. నూతన సబ్ - డివిజనల్ పోలీస్ కార్యాలయం అందుబాటులోకి రావడంతో అమలాపురం సబ్ - డివిజన్ పరిధిలో పోలీసు పరిపాలన, శాంతిభద్రతల పర్యవేక్షణ మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అవకాశం ఏర్పడిందని ఐజీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిరాజు, ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణ, బొమ్మి ఇజ్రాయెల్, పేరాబత్తుల రాజశేఖరం, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అల్లాడ శరత్‌బాబు, పెచ్చెట్టి చంద్రమౌళి, ఆర్డీఎస్ ప్రసాద్, కంచిపల్లి అబ్బులు, బోణం సత్యవరప్రసాద్ అదనపు ఎస్పీ మహేంద్ర మత్తే, అమలాపురం ఎస్‌డీపీఓ టి.ఎస్.ఆర్.కె. ప్రసాద్, అమలాపురం టౌన్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ పి. వీరబాబు, ఎస్సైలు, పంచాయతీరాజ్ అధికారులు, ఇతర పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు హాజరయ్యారు.

## బుధవారం విద్యుత్ కు అంతరాయం

**భీమిలి సిటిజన్ టైమ్స్ ఆగష్టు 25**

33/11కేవి సబ్ స్టేషన్ లో గల 11కేవి వేములవలస ఇండస్ట్రియల్ లైనులను తాకుతున్న చెట్ల కొమ్మలను తొలగించుట నిమిత్తం బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు భీమిలి మండలం లో జె వి. అగ్రహారం, కొత్త వలస, నిడిగట్టు, ప్రాంతాలకు విద్యుత్ నిలుపుదల చెయ్యబడును అని భీమిలి జోన్ -3 ఏడి బి సింహాచలం నాయుడు తెలిపారు. ప్రజలు సహకరించగలరు ఆయన కోరారు.



షామా సికిందర్ అద్భుతమైన డెనిమ్ లుక్



# జెట్ స్పీడ్‌లో ప్రజెట్ స్పీడ్‌లో ప్రభాస్ లైనప్ - హను రాఘవపూడితో మరో క్రేజీ ప్రాజెక్ట్!

ప్రస్తుతం రెబల్ స్టార్ ప్రభాస్ వరుస ప్రాజెక్టలతో జెట్ స్పీడ్‌లో దూసుకుపోతున్నారు. ఒకవైపు గ్లోబల్ ప్రాజెక్టలు చేస్తూనే.. మరోవైపు యువ దర్శకులతో ప్రయోగాత్మక చిత్రాలకు గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నారు. ఇప్పటికే పలు భారీ బడ్జెట్ సినిమాలతో బిజీగా ఉన్న ప్రభాస్ షెడ్యూల్‌లో మరో క్రేజీ ప్రాజెక్ట్ చేరనుందనే వార్తలు టాలీవుడ్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ప్రస్తుతం ప్రభాస్ నటిస్తోన్న -ఫౌజీ- షూటింగ్ చివరి దశకు చేరుకున్న విషయం తెలిసిందే. హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న పీరియాడిక్ వార్ డ్రామాపై అభిమానుల్లో భారీ అంచనాలున్నాయి.ఈ సినిమా సెట్స్‌లో దర్శకుడు హను రాఘవపూడి వర్కింగ్ స్టైల్, టేకింగ్ విధానం ప్రభాస్‌కు బాగా నచ్చినట్లు తెలుస్తోంది. ఈ సినిమా చిత్రీకరణ సమయంలో కథలోని డెప్త్, ఎమోషనల్ కంటెంట్ ప్రభాస్‌ను ఎంతగానో ఆకట్టుకున్నాయట. ఈ నేపథ్యంలోనే హను రాఘవపూడి చెప్పిన మరో సరికొత్త కథకు ప్రభాస్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు ఫిలిం నగర్ సర్కిల్స్‌లో జోరుగా ప్రచారం జరుగుతోంది. ఇద్దరి కాంబినేషన్‌లో వస్తోన్న -ఫౌజీ- అనుకున్న దానికంటే అద్భుతంగా రావడంతో? రిపీట్ కొలాబరేషన్‌కు తీస్తున్నట్లు సమాచారం.ఈ ప్రాజెక్టను టాలీవుడ్‌లోని ప్రముఖ నిర్మాణ సంస్థలలో ఒకటైన హోంబలే ఫిలిమ్స్ - మైత్రి మూవీ మేకర్స్ సంస్థల్లో ఏదో ఒకటి నిర్మించే అవకాశం ఉందంటున్నారు. ఇప్పటికే ఈ ప్రొడక్షన్ హౌస్‌లతో ప్రభాస్‌కు మంచి అనుబంధం ఉండటంతో త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే ఛాన్స్ ఉందంటున్నారు. మరోవైపు ప్రభాస్ ఖాతాలో ప్రకంపనలు సృష్టించేందుకు సిద్ధంగా ఉన్న -కల్కి 2-, సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో తెరకెక్కుతోన్న -స్పిరిట్-.. అలాగే ప్రశాంత్ నీల్ తో -సలార్ 2- వంటి భారీ చిత్రాలు క్యూలో ఉన్నాయి.ఇలాంటి బిజీ షెడ్యూల్ మధ్యలోనూ మరో కొత్త సినిమాకు డార్లింగ్ డేట్స్ కేటాయించడం ప్రభాస్ నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తోంది. ఒకరి తర్వాత ఒకరుగా క్రేజీ ప్రాజెక్టలను లైన్‌లో పెడుతున్న రెబల్ స్టార్ వేగం చూస్తుంటే రాబోయే రెండు.. మూడేళ్లలో బాక్సాఫీస్ రికార్డులన్నీ డార్లింగ్ పేరిట ఖాయమనిపిస్తోంది. వరుస పాన్-ఇండియా చిత్రాలతో తెలుగు సినిమా స్థాయిని ప్రపంచవ్యాప్తంగా నెక్ట్స్ లెవెల్‌కు తీసుకువెళ్తున్నారు. ప్రభాస్ తో పాటు బన్నీ కూడా అదే రేంజ్ లో కెరీర్ ని ప్లాన్ చేసుకుని ముందుకెళ్తున్నారు. ఇదే తరహాలో రామ్ చరణ్, ఎన్టీఆర్, మహేష్ కూడా భవిష్యత్ ప్రాజెక్ట్ లను ప్లాన్ చేసుకుంటున్నారు. ఇప్పటికే వారంతా కూడా తదుపరి చిత్రాల విషయంలో ఓ నిర్ణయానికి వచ్చారు

భాస్ లైనప్ - హను రాఘవపూడితో మరో క్రేజీ ప్రాజెక్ట్!
ప్రస్తుతం రెబల్ స్టార్ ప్రభాస్ వరుస ప్రాజెక్టలతో జెట్ స్పీడ్‌లో దూసుకుపోతున్నారు. ఒకవైపు గ్లోబల్ ప్రాజెక్టలు చేస్తూనే.. మరోవైపు యువ దర్శకులతో ప్రయోగాత్మక చిత్రాలకు గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నారు. ఇప్పటికే పలు భారీ బడ్జెట్ సినిమాలతో బిజీగా ఉన్న ప్రభాస్ షెడ్యూల్‌లో మరో క్రేజీ ప్రాజెక్ట్ చేరనుందనే వార్తలు టాలీవుడ్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ప్రస్తుతం ప్రభాస్ నటిస్తోన్న -ఫౌజీ- షూటింగ్ చివరి దశకు చేరుకున్న విషయం తెలిసిందే. హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న పీరియాడిక్ వార్ డ్రామాపై అభిమానుల్లో భారీ అంచనాలున్నాయి. ఈ సినిమా సెట్స్‌లో దర్శకుడు హను రాఘవపూడి వర్కింగ్ స్టైల్, టేకింగ్ విధానం ప్రభాస్‌కు బాగా నచ్చినట్లు తెలుస్తోంది. ఈ సినిమా చిత్రీకరణ సమయంలో కథలోని డెప్త్, ఎమోషనల్ కంటెంట్ ప్రభాస్‌ను ఎంతగానో ఆకట్టుకున్నాయట. ఈ నేపథ్యంలోనే హను రాఘవపూడి చెప్పిన మరో సరికొత్త కథకు ప్రభాస్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు ఫిలిం నగర్ సర్కిల్స్‌లో జోరుగా ప్రచారం జరుగుతోంది. ఇద్దరి కాంబినేషన్‌లో వస్తోన్న -ఫౌజీ- అనుకున్న దానికంటే అద్భుతంగా రావడంతో? రిపీట్ కొలాబరేషన్‌కు తీస్తున్నట్లు సమాచారం.



బోల్డ్ స్ట్రీట్‌వేర్ స్టైల్‌లో మెరుపులు

# ముగిసిన మూడో రోజు ఆట.. లంక పోరాడినా భారత్‌దే ఆధిపత్యం

- భారత్‌తో రెండో టెస్టులో శ్రీలంక ప్రతిఘటన
- అజేయంగా 84 పరుగులు చేసి ఒంటరి పోరాటం చేస్తున్న సోనాల్ దినూశ
- మూడో రోజు ఆట ముగిసేసరికి శ్రీలంక స్కోరు 265/8
- ప్రస్తుతం 238 పరుగుల భారీ ఆధిక్యంలో టీమిండియా
- వర్షం, వెలుతురులేమి కారణంగా ముందుగానే ముగిసిన ఆట



భారత్‌తో జరుగుతున్న రెండో టెస్టులో శ్రీలంక గట్టిగా పోరాడుతున్నప్పటికీ, టీమిండియా పట్టు బిగించింది. కొలంబోలోని సింహళీస్ స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో మూడో రోజు ఆట ముగిసే సమయానికి శ్రీలంక 8 వికెట్ల నష్టానికి 265 పరుగులు చేసింది.
వర్షం, వెలుతురులేమి కారణంగా ఆటను ముందుగానే నిలిపివేశారు. ప్రస్తుతం భారత్ ఇంకా 238 పరుగుల భారీ ఆధిక్యంలో ఉండి మ్యాచ్‌పై పూర్తి నియంత్రణతో ఉంది.మూడో రోజు ఆటలో శ్రీలంక బ్యాటర్ సోనాల్ దినూశ అద్భుత బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ 135 బంతుల్లో 84 పరుగులతో అజేయంగా నిలిచాడు. భారత స్పిన్నర్లపై స్వీప్ షాట్లను సమర్థంగా ఆడుతూ ఒంటరి పోరాటం చేశాడు. ఈ ఇన్నింగ్స్‌తో అతను ఒక అరుదైన ఘనత సాధించాడు. భారత్‌పై తన తొలి మూడు టెస్ట్ ఇన్నింగ్స్‌లలో వరుసగా మూడు 50ం స్కోర్లు సాధించిన రెండో శ్రీలంక బ్యాటర్‌గా (దులీప్ మెండిస్ తర్వాత) రికార్డు సృష్టించాడు.
అతనికి కేశర నువంత (18) నుంచి కొంత సహకారం లభించింది. అయితే, వీరి భాగస్వామ్యాన్ని భారత యువ స్పిన్నర్ మానవ్ సుతార్ విడదీశాడు. సుతార్ బౌలింగ్‌లో భారీ షాట్‌కు యత్నించిన నువంత, మిడ్-ఆఫ్‌లో సారాంశ్ జైన్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. భారత బౌలర్లలో ప్రసిధ్ కృష్ణ, మానవ్ సుతార్ అద్భుతంగా రాణించి చెరో మూడు వికెట్లు పడగొట్టగా, రవీంద్ర జడేజా ఒక వికెట్ తీశాడు.మూడో రోజు చివరి సెషన్‌లో రెండో కొత్త బంతి అందుబాటులోకి రావడంతో శ్రీలంక ఇన్నింగ్స్‌ను త్వరగా ముగించాలని భారత్ భావించింది. కానీ, వెలుతురు తగ్గడంతో స్పిన్నర్లతోనే బౌలింగ్ కొనసాగించాల్సి వచ్చింది. సాయంత్రం 5 గంటల సమయంలో వర్షం ప్రారంభమవడంతో అంపైర్లు ఆటను నిలిపివేశారు. ఆ తర్వాత వాతావరణం అనుకూలించకపోవడంతో 5:15 గంటలకు మూడో రోజు ఆట ముగిసినట్లు ప్రకటించారు.ఆట ముగిసే సమయానికి దినూశ 84 పరుగులతో, లహిరు కుమార 8 పరుగులతో క్రీజులో ఉన్నారు. శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో భారత్ స్కోరు (503/9 డిక్లేర్డ్)కు ఇంకా 238 పరుగులు వెనుకబడి ఉంది. కేవలం రెండు వికెట్లు మాత్రమే చేతిలో ఉన్నందున, నాలుగో రోజు శ్రీలంక ఇన్నింగ్స్‌ను త్వరగా ముగించి, మ్యాచ్‌పై పూర్తి పట్టు సాధించాలని టీమిండియా భావిస్తోంది.

# బౌలర్‌గానూ వైభవ్ సూర్యవంశీ అదుర్స్.. ఒకే ఓవర్‌లో రెండు వికెట్లు

- దులీప్ ట్రోఫీ అరంగేట్రంలో వైభవ్ 8 పరుగులకే ఔట్
- కేవలం ఆరు బంతులే ఎదుర్కొన్న యువ బ్యాటర్
- రెండో ఇన్నింగ్స్‌లో బౌలింగ్ చేసిన వైభవ్
- ఒకే ఓవర్లో రెండు వికెట్లు తీసిన వైనం

వైభవ్ సూర్యవంశీ అంటే బ్యాట్‌తో విధ్వంసమే గుర్తుకొస్తుంది. కానీ, ఈసారి బంతితోనూ అదరగొట్టాడు. నాలుగు బంతుల వ్యవధిలోనే రెండు వికెట్లు తీసి అందరినీ ఆశ్చర్యపరిచాడు. బ్యాట్‌తో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయినా.. దులీప్ ట్రోఫీ అరంగేట్రంలో బంతితో మాత్రం తనలోని కొత్త టాలెంట్‌ను బయటపెట్టాడు.నార్త్ ఈస్ట్ జోన్‌తో జరుగుతున్న క్వార్టర్ ఫైనల్‌లో ఈస్ట్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 467 పరుగులు చేసింది. సుదీప్ కుమార్ ఘరామి 146, షాబాజ్ అహ్మద్ 167 పరుగులతో రాణించారు. అనంతరం నార్త్ ఈస్ట్ జోన్‌ను తొలి ఇన్నింగ్స్‌లో 111 పరుగులకే కట్టడి చేసిన ఈస్ట్ జోన్ ఫాలోఆన్ విధించింది.
రెండో ఇన్నింగ్స్‌లోనూ నార్త్ ఈస్ట్ జోన్ బ్యాటర్లు తడబడ్డారు. 90 పరుగులకే ఎనిమిది వికెట్లు కోల్పోయింది. వైభవ్ సూర్యవంశీ తన ఎడమచేతి స్పిన్‌తో ఒకే ఓవర్లో రెండు వికెట్లు పడగొట్టాడు.జట్టు తరఫున అత్యధికంగా 25 పరుగులు చేసిన కిషన్ లింగ్‌డో, 4 పరుగులు చేసిన ఇమ్లివాటి లెమ్టూర్‌ను వైభవ్ పెవిలియన్‌కు పంపాడు. ఆ రెండు వికెట్లు కూడా అతడికి క్యాచ్‌ల రూపంలో దక్కడం విశేషం. దీంతో వైభవ్‌కు ఒకే ఓవర్లో 'డబుల్ డిలైట్' దక్కిందని బీసీసీఐ సోషల్ మీడియాలో ప్రశంసించింది.మరోవైపు వైభవ్ జెర్సీ నంబర్‌పైనా ఆసక్తికర చర్చ సాగింది. అతడి జెర్సీ నంబర్‌లో కొంత భాగాన్ని టేప్‌తో కప్పి ఉంచారు. దీంతో కేవలం '3' మాత్రమే కనిపించింది.



ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ తరఫున కూడా వైభవ్ '3' నంబర్ జెర్సీ ధరిస్తాడు. జెర్సీపై ముద్రణలో లోపం వల్లే మిగిలిన సంఖ్యను టేప్‌తో కప్పి ఉండొచ్చని భావిస్తున్నారు.

# కోహ్లీ, రోహిత్ లేకపోతే ఇంతేనా?.. అయ్యయ్యో బీసీసీఐకి కోట్లు నష్టం వచ్చిందిగా!

ప్రపంచంలోనే అత్యంత రిచెస్ట్ క్రికెట్ బోర్డ్ అయిన బీసీసీఐకి టీమిండియా టైటిల్ స్పాన్సర్‌షిప్ విషయంలో ఊహించని షాక్ తగిలింది. రాబోయే రెండేళ్లలో భారత్ స్వదేశంలో ఆడబోయే సుమారు 35 మ్యాచ్‌ల కోసం ప్రతీ మ్యాచ్‌కి కనీస ధరగా రూ. 4.85 కోట్లను నిర్ణయించి టెండర్లు పిలిచింది. కానీ ఆగస్టు 13వ తేదీ నాటికి బిడ్స్ సమర్పించడానికి గడువు ముగిసినప్పటికీ, ఒక్క కంపెనీ కూడా ముందుకు రాలేకపోయింది. బీసీసీఐ చరిత్రలోనే బిడ్లు రాక గడువు పొడిగించాల్సి రావడం తొలిసారి. ప్రస్తుతం టైటిల్ స్పాన్సర్‌గా ఉన్న ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ ప్రతి మ్యాచ్‌కి రూ. 4.2 కోట్లు చెల్లిస్తుండగా, బీసీసీఐ ఏకంగా ధరను భారీగా పెంచడంతో కంపెనీలు వెనకడుగు వేశాయి.





**కోహ్లీ, రోహిత్ లేకపోతే క్రేజ్ తగ్గినట్లేనా?:**

ధరను భారీగా పెంచడంతో పాటు స్పాన్సర్లు ముందుకు రాకపోవడానికి వెనుక మరో ప్రధాన కారణం ఉందనే టాక్ గట్టిగానే నడుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా విపరీతమైన క్రేజ్ ఉన్న విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలు టెస్టులు, టీ20లకు దూరమవ్వడమే బ్రాండ్ విలువ తగ్గడానికి కారణమని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఈ ఇద్దరు ప్లేయర్లు లేకపోతే మ్యాచ్‌లకు ఉండే వ్యూయర్‌షిప్, బ్రాండ్ రీచ్ భారీగా తగ్గుతుందని లెక్కిస్తున్న కంపెనీలు.. అంత పెద్ద మొత్తంలో ఇన్వెస్ట్ చేయడానికి ఆలోచిస్తున్నాయి.

**గూగుల్ జెమిని, ఎస్‌బీఐ లైఫ్‌తో డైరెక్ట్ చర్చలు:**

జూలై 20వ తేదీన ఐటీటీ డాక్యుమెంట్స్ విడుదల చేసి గడువు పెట్టినా బిడ్లు రాకపోవడంతో బీసీసీఐ ఇప్పుడు ప్రత్యామ్నాయ మార్గాలపై ఫోకస్ పెట్టింది.
డైరెక్ట్ టాక్స్: గూగుల్ జెమిని , స్పిన్నీ , ఎస్‌బీఐ లైఫ్ లాంటి పలు బ్రాండ్లతో బోర్డు నేరుగా చర్చలు జరుపుతోంది.
ఆర్ఎఫ్‌క్యూ విడుదల: అసోసియేట్ పార్ట్‌నర్ హక్కుల కోసం రిక్వెస్ట్ ఫర్ కొటేషన్ రిలీజ్ చేసింది. పత్రాలు కొనుగోలు చేయడానికి ఆగస్టు 14, స్పష్టతకు ఆగస్టు 16, కొటేషన్లు సమర్పించడానికి ఆగస్టు 25 లాస్ట్ డేట్ గా నిర్ణయించింది.
టైటిల్ స్పాన్సర్ కన్ఫర్మ్ అయిన తర్వాతే అసోసియేట్ పార్ట్‌నర్లు ఖరారవుతారు. హోమ్ సీజన్ ప్రారంభమయ్యేలోపే బీసీసీఐ ఆశించిన భారీ ధరకి స్పాన్సర్‌షిప్ డీల్ క్లోజ్ అవుతుందో లేదో చూడాల్సి ఉంది.

Printed, published,and owned by kancherla Sandeep kumar. Published at Door. No. 19-57, Deendayalpuram, mudasarlova, Visakhapatanam, Andrapradesh 530040.
Printed at Sri Sai Ganga printer's and publications flat no. 504,Bharat towers, 5th lane, Dwarakanagar, Visakhapatanam,Andrapradesh 530016.
Editor. Kancherla Sandeep Kumar. RNI No. APTEL /2009/28868.PHONE No. 9966447776